Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03




నెల్లూరు, 26.07.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 08 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## జయప్రదంగా... జాబిలి యాత్ర



- ఫలించిన 'ఇస్రో' ప్రయత్నం
- జిఎస్ఎల్‌వి మార్క్3 సఫలం
- 48రోజుల్లో చంద్రుడిపై దిగనున్న విక్రమ్

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అంతరిక్ష ప్రయోగాలలో మరో అధ్యాయాన్ని సృష్టించింది. నూటముప్పై కోట్ల భారతీయుల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. దేశం యావత్తు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న క్షణాలను ఎంతో అద్భుతంగా మలచింది. (మిగతా 10వ పేజీలో)



## సభ కట్టుతప్పుతోంది!

- గత టిడిపి సభ్యులను తలపిస్తున్న వైసిపి సభ్యులు
- చర్చలకంటే రచ్చ ఎక్కువవుతోంది
- చంద్రబాబు హోదాను కాదు వయసును గౌరవించాలి

రేయ్ ఏంట్రా.. పాతేస్తా నా కొడకా... అని అసెంబ్లీలో బోండా ఉమామహేశ్వరరావు ఆవేశంగా అరిచినప్పుడు, అప్పుడు అధికార తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష నేతగా వున్న చంద్రబాబు నాయుడు... మాట్లాడాల్సిన పద్ధతి ఇది కాదు అని అతని నోటికి (మిగతా 11వ పేజీలో)



జననం : 16.10.1930 మరణం : 20.07.2019



కీ.శే. తుంగా రాజగోపాలరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

### శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(లేట్ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)

తే.20.07.2019ది శనివారం స్వర్గస్తురాలైనారు.

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు:** వారి ఉత్తరక్రియలు తే.03.08.2019ది శనివారం ఉదయం 11గంటలకు నెల్లూరు మాగుంట లే అవుట్, 2వ మెయిన్, 2వ క్రాస్‌లోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



# కల్తీతో... శాల్తీలే గల్లంతు!

'నేతిబీరలో నేయిలాగా'...అనేది పెద్దలు చెప్పే సామెత. 'నేతి'బీర..పేరుకు మాత్రమేనని, అందులో నేయి మాత్రం ఉండదన్నది ఇందులో సారాంశం. పేరులో గొప్పదనం ఉన్నా లోపల డొల్లగా ఉండడాన్ని ఈ పోలిక ద్వారా చెప్తారు. అయితే, ఇప్పుడు నేతిబీర కూడా సిగ్గుపడే విధంగా, కల్తీవ్యాపారులు తమ విశ్వరూపం చూపిస్తున్నారు. మాది భలే శుద్ధమైన నెయ్యి అని చెప్పుకుంటూ రకరకాల బ్రాండ్‌లతో నకిలీ నెయ్యిని శుద్ధంగా అమ్మేసుకునే అక్రమార్కులు బోలెడంతమంది ఉంటున్నారు. ఎందెందు వెతికి చూసిన..అందందే కలదు..కల్తీ!...అన్నట్లుగా అంతా కల్తీమయం అయిపోయింది. అసలు-నకిలీలో అసలు అన్నది ఎప్పుడో మాయమైపోయింది. నకిలీయే మనకిప్పుడు మిగిలింది. కలికాలం కల్తీకాలంగా రూపుదాల్చింది. అందరికీ ధనార్జనే ధ్యేయమైపోయింది. అందుకే, అవినీతి సర్వాంతర్యామిగా మారిపోయింది.

## ○ నకిలీ నెయ్యితో.. కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
## ○ అవినీతిపరుల భరతం పడతామంటున్న అధికారులు


కల్తీ!..కల్తీ!..కల్తీ!..ఎక్కడ చూసినా ఇదే మాట. ఏ వస్తువులో చూసినా ఎంతో కొంత కల్తీ కనపడుతూనే ఉంది. నిత్యం వాడే సరుకుల్లో బోలెడంత కల్తీ ఉంటోంది. ఏది నకిలీయో ఏది అసలుదో తెలుసుకోలేని విధంగా నకిలీయే అసలదైనట్లుగా నమ్మించి బురిడీ కొట్టించే వ్యాపారుల అక్రమాలకు అంతే ఉండడం లేదు. తాజాగా నెల్లూరు కేంద్రంగా నకిలీ నెయ్యి అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని తెలియడంతో జిల్లా ప్రజానీకం ఉలిక్కి పడింది. మనం వంటల్లో వాడుతున్నది కల్తీదా.. మంచిదా అనుకుంటూ తర్జన భర్జనలు పడుతున్నారు.

### కొంటే కొను..
### లేకుంటే మానెయ్యి

నకిలీ నెయ్యి వ్యాపారులకు ధనార్జనే ధ్యేయం. జనం ఆరోగ్యం ఎటుపోయినా వారికి అక్కర్లేదు. 'మాది మంచినెయ్యి.. తింటే తినండి..కొంటే కొనండి..లేకుంటే మానెయ్యండి' అంటూ తమది శుద్ధమైన నెయ్యి అన్నట్లుగా గొప్పగా చెప్పుకుంటూ ఆ కల్తీనెయ్యినే ఎక్కువ ధరలకు అమ్మేసుకోవడం వారి వ్యాపారశైలి. అయినా, ఏదైనా ఒక ఉత్పత్తి మార్కెట్‌లోకి రావాలంటే ప్రభుత్వపరంగా బోలెడన్ని నియమ నిబంధనలుంటాయి. అధికారుల పరిశీలనలు, పర్యవేక్షణలు ఎన్నో ఉంటాయి. కానీ, అక్రమార్కులు అవేమీ పట్టించుకోరు. ప్యాకెట్‌లో కల్తీ నెయ్యిని పోసి, ఏదో ఒక కొత్త బ్రాండ్ పేరుతో అమ్మేస్తుంటారు. అయితే, వ్యాపారమన్నాక కొంత లాభం ఉండాలి కాబట్టి లాభం కోసం వ్యాపారం చేసుకున్నా, తినే వస్తువుల్లో తాగే వాటిలో కల్తీ చేస్తే అంతకన్నా పాపం మరొకటి ఉండదు. చేసేది వ్యాపారమే అయినా కాస్తంతైనా మానవత్వం కూడా ఉండాలి. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే కల్తీ సరుకులను అమ్మడమే దారుణం!.. ఘోరమైన నేరం కూడా. కొనేవాడి ఆరోగ్యం నాశనమైపోయినా పర్వాలేదు... మన బొక్కసం నిండితే చాలనుకున్నట్లుగా వ్యవహరిస్తే.. చివరికి ఏం మిగలబెట్టుకుంటారో ఎవరికి వారు లోతుగా ఆలోచించుకోవాలి.

### నెయ్యిలో..
### కల్తీవ్యాపారుల చెయ్యి...

ఇటీవల గుంటూరుజిల్లా నరసరావుపేటకు చెందిన ఒక వ్యాపారి ఉదంతం బయటపడింది. మాది శుద్ధమైన నెయ్యి అంటూ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీదారులను కూడా సిద్ధం చేసుకుని నకిలీనెయ్యిని బాగా అమ్మేసుకుని, జనానికి కుచ్చుటోపీ పెట్టి కోట్లాదిరూపాయలు అక్రమంగా ఆర్జిస్తుండడం వెలుగులోకి వచ్చింది. స్వచ్ఛమైన ఆవునెయ్యి సుమారు 300కు పైగానే ధర ఉంటే, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన ఈ నకిలీ వ్యాపారులు మాత్రం 120 రూపాయలకే ఆవునెయ్యి ప్యాకెట్‌లు విక్రయిస్తున్న విషయం బయటపడడంతో, ఇంత తక్కువ ధరకే నెయ్యి ఎలా వస్తోందబ్బా.. అని అధికారులు ఆరా తీస్తే చివరికి బోగోతం బయటపడింది. ఆ నెయ్యి ప్యాకెట్ మీద ఎంఆర్‌పి ధర 270 రూపాయలుగా ఉంది. అయితే, దాన్ని పంపిణీదారులకు 70 రూపాయలకే ఇస్తున్నారు. పంపిణీదారులు దాన్ని హోల్‌సేల్ అంగళ్ళ వారికి 120కో లేదా 150కో ఇస్తారు. అంటే ఒక్కో ప్యాకెట్ మీద ఈ పంపిణీదారులకు కనీసం అంతకు అంత.. అంటే 50 నుంచి 80 రూపాయల దాకా 'లాభం' వస్తుంది. ఒక ప్యాకెట్‌ను 70 రూపాయలకు ఇచ్చినా తయారీదారైన నరసరావుపేట వ్యాపారికి బాగా గిట్టుబాటు అవుతున్నదంటే, ఆ నెయ్యిలో ఎంత కల్తీ ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఆ ప్యాకెట్లలో నెయ్యి శాతం ఏ మేరకు ఉందో ల్యాబొరేటరీల్లో పరిశీలించి చూస్తే.. ఇది నకిలీదని, నరసరావుపేటలో ఉన్న నెయ్యి తయారుచేసే ప్లాంట్‌కు అసలు ప్రభుత్వం నుంచి అనుమతే లేదని కూడా వెల్లడైంది. ఇలా ఎన్ని రకాల ఆహారపదార్థాలు కల్తీకి గురవుతున్నాయో.. ఆ దేవుడికే ఎరుక!.. తినే ఆహారపదార్థాలను కూడా కల్తీచేసి జనం నోళ్ళుకొట్టి కోట్లు సంపాదించే ఇలాంటి అవినీతి వ్యాపారులపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అధికారులు సంసిద్ధమవుతున్నారు.



# సుందరీకరణ పేరుతో ఛండాలం చేశారు

## - అసెంబ్లీలో ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు నగర సుందరీకరణ పేరుతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా పనులు చేసి ఛండాలం చేసి పెట్టారని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించాడు. అసెంబ్లీ సమావేశాలలో ఆయన నెల్లూరు చెరువు విషయాన్ని ప్రస్తావించాడు. నెల్లూరు చెరువు తూములను సుందరీకరణ పేరుతో మూసేశారు. అమృత పథకం పేరుతో దాని హద్దులు చెరిపేశారు. గత ప్రభుత్వంలోని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అనాలోచిత నిర్ణయం కారణంగా నెల్లూరు చెరువు ఆయకట్టు క్రింద రైతులకు సమాచారం ఇవ్వకుండానే అనవసర నిర్మాణాలు చేపట్టారు. చెరువు ద్వారా వచ్చే పంటకాలువల వ్యవస్థను చెడగొట్టారు. నెక్లెస్‌రోడ్డు నిర్మాణంలో సిమెంట్ రోడ్డు క్రింద చెరువులోని లూజ్‌సాయిల్‌నే వాడడంతో రోడ్డు అంతా పగుళ్లిచ్చింది. 2015లో వరదలు సంభవించినప్పుడు అప్పుడు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నెల్లూరులోనే మూడురోజులు వున్నారు. నెల్లూరు చెరువు గురించి అప్పట్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. గత పాలకులు ఇరిగేషన్, వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులను సంప్రదించకుండానే అడ్డదిడ్డంగా పనులు చేసి నెల్లూరు చెరువును నాశనం చేశారు. అప్పటి మంత్రి నారాయణకు నెల్లూరు నిండా కాలేజీ భవనాలున్నాయి. కాని వ్యవసాయం చేసేందుకు సెంటు భూమి లేదు. అందుకే ఆయనకు రైతుల బాధలు అర్థం కాలేదు. ఈ చెరువు వెనుకాల నరసింహకొండలున్నాయి. ఆ పైనుండి వచ్చే నీళ్ళన్నీ నెల్లూరు చెరువులో చేరుతాయి. భవిష్యత్‌లో నెల్లూరు చెరువుకు వరదలు వస్తే తూములు మూసేసినందువల్ల చెరువు కట్ట తెగి నెల్లూరు మునిగిపోవడం ఖాయమని ఆయన పేర్కొన్నాడు. దీనిపై మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందిస్తూ దీనిపై విచారణ జరిపించి గత ప్రభుత్వంలో చేసిన తప్పులను సరిదిద్దుతామని హామీ ఇచ్చాడు.

# నత్తనడకన క్రీడా అకాడమీ

## పార్లమెంటులో ప్రస్తావించిన నెల్లూరు ఎంపి ఆదాల



నెల్లూరు శివార్లలోని ఆమంచర్ల వద్ద 'ఖేలో ఇండియా' క్రింద మూడేళ్ళ క్రితం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా అకాడమీ పనులు నత్తనడకన సాగుతున్నాయని నెల్లూరు పార్లమెంటుసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంటు సమావేశాలలో భాగంగా గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆదాల ఈ అంశంపై మాట్లాడారు. స్పోర్ట్స్ అకాడమీ పనులు చిత్తశుద్ధితో సాగడం లేదని, ఏ పనీ సక్రమంగా లేదని, దీనికి అవసరమైన నిధులు విడుదల చేయడంతో పాటు పనులు సత్వరం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర క్రీడాశాఖా మంత్రిని కోరారు. దీనిపై కేంద్ర క్రీడాశాఖా మంత్రి కిరణ్‌రిజుజూ స్పందించి క్రీడా అకాడమీ నిర్వహణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని, 'ఖేలో ఇండియా' బాధ్యత కేవలం కేంద్రప్రభుత్వందే కాదని, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కూడా ఉంటుందని గుర్తు చేశారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి దేశానికి ఉపయోగపడే విధంగా వారిని తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఇరు ప్రభుత్వాలు కృషిచేస్తాయని ఆయన సభలో హామీ ఇచ్చారు.

# పాఠశాలలనే కాదు...

# వైద్యశాలలనూ దత్తత తీసుకోండి



అభివృద్ధి చెందిన దేశాలలో విద్య, వైద్యం సేవలు ప్రభుత్వ ఆధీనంలో వుంటాయి. మిగతావన్నీ ప్రైవేట్ రంగంలో వుంటాయి. మిగతావి వ్యాపార సంబంధమైనవి కాబట్టి ప్రైవేట్ రంగంలో వున్నా ఇబ్బంది లేదు. కాని విద్య, వైద్యం అన్నవి ప్రభుత్వ ఆధీనంలో లేకుండా ప్రైవేట్‌పరమైతే పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి ఎంత దుర్భరంగా వుంటుందో మన దేశంలో చూస్తూనే వున్నాం.

ఏవైతే ప్రభుత్వ ఆధీనంలో వుండాలో ఆ రెండూ(విద్య, వైద్యం) మన దేశంలో మరీముఖ్యంగా మన రాష్ట్రంలో ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. కాబట్టే చదువులు, వైద్యం అంటే ఖర్చు లక్షల్లో వుంటోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో పాఠశాలలు వైద్యశాలలు వున్నప్పటికీ ప్రైవేట్ సంస్థలతో అవి పోటీ పడలేకపోవడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు సైతం ప్రైవేట్ వైద్యశాలలను, కార్పొరేట్ చదువులను ఆశ్రయిస్తున్నారు.

జిల్లాకు చెందిన జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరు నగరంలో మూడు కార్పొరేషన్ హైస్కూళ్ళను ఇటీవల దత్తత తీసుకున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వాటిని తయారు చేయాలని సంకల్పించారు. ఆలోచన మంచిదే! దాంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులను కూడా దత్తత తీసుకోవాల్సివుంది. ప్రైవేట్ వైద్యశాలలకు ప్రభుత్వ వైద్యశాలలు ఏ మాత్రం తీసిపోవు. పెద్దపెద్ద భవనాలు, వార్డులు, డాక్టర్ రూమ్‌లు, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్‌లు... అన్నీ వుంటాయి. కాని, తగిన సమయంలో తగు వైద్యసిబ్బందే ఉండరు. ఇప్పుడు నెల్లూరులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రినే తీసుకుంటే... కార్పొరేట్ స్థాయిలో కట్టారు. అన్ని విభాగాలు వున్నాయి. కాని ఆ విభాగలకు తగ్గట్లు వైద్య సిబ్బంది, ల్యాబ్ స్టాఫ్ అందుబాటులో వుండరు. ఉన్నవాళ్ళు సక్రమంగా విధులు నిర్వహించరు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ తగిన వైద్య సిబ్బంది, వైద్య సదుపాయాలు వుండేలా చేస్తే, వచ్చిన రోగులకి వైద్య సేవలందిస్తే ప్రైవేట్ ఆసుపత్రులకు పోయి వేలకు వేలు ఖర్చు చేసుకునే బాధలు తప్పుతాయి. మంత్రి స్థాయిలో, అలాగే ఎమ్మెల్యేల స్థాయిలో వారి వారి నియోజకవర్గాల పరిధిలో వున్న ప్రభుత్వ ఆసుపత్రులలో వాళ్ళు ఒకట్రెండు లెక్కన దత్తత తీసుకుని వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెడితే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు... అది కూడా ఖర్చు లేకుండా అందించడం పెద్ద సమస్య కాదు.

## కాలధర్మం

# తుంగా శ్రీదేవమ్మ



లాయర్ పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ జులై 20వ తేదీ రాత్రి 10గంటల 24నిముషాలకు శివసాన్నిధ్యం పొందారు. ఆమె వయస్సు 89సంవత్సరాలు. ఆమెకు ఆరుగురు సంతానం. ప్రకాశం జిల్లా ఈతముక్కల గ్రామం ఆమె స్వస్థలం. ఆమె కేశవరపు వారి ఆడపడచు. 1954లో రాజగోపాలరెడ్డి గారిని వివాహం చేసుకుంది. కుటుంబంలో అన్నీ తానే అయ్యి ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచింది. వ్యాపారం, రాజకీయం, పాత్రికేయం రంగాలలో రాజగోపాలరెడ్డి గారు నిత్యం పని వత్తిడిలో వున్న తరుణంలో కుటుంబ బాధ్యతలతో పాటు అయన స్వగ్రామంలోని వ్యవసాయ విషయాలను కూడా ఆమే చూసుకునే వారు. 64యేళ్ళ వయస్సులోనే 1995 జనవరి18న 24 సంవత్సరాల క్రితం రాజగోపాలరెడ్డి గారు దివంగతులు కావడంతో అప్పటి నుండి శ్రీదేవమ్మే కుటుంబానికి అండగా నిలిచారు.

ఇటీవల స్వల్ప అనారోగ్యానికిలోనైన ఆమె జులై 20వతేదీ శనివారం తన చిన్న కుమారుడు లాయర్ వారపత్రిక సంపాదకుడు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) ఇంట తుదిశ్వాస విడిచారు.

జులై 21 వ తేదీ జరిగిన ఆమె అంత్యక్రియలలో పలువురు నగర ప్రముఖులు, తుంగా కుటుంబ బంధుమిత్రులు, ఆప్తులు, లాయర్ పత్రిక అభిమానులు పాల్గొని శ్రీదేవమ్మ భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు.

నీటిపారుదల శాఖ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, సూళ్లూరుపేట శాసన సభ్యుడు కిలివేటి సంజీవయ్య, మాజీ శాసనసభ్యుడు జె.కె.రెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డా॥ జడ్.శివప్రసాద్, వైసిపి నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వై.వి.రామి రెడ్డి, నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డా॥ సి.యం.కె.రెడ్డి, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, రత్నం విద్యా సంస్థల అధినేత కె.వి.రత్నం, సామంతు గోపాలరెడ్డి, ఎంజిబి మాల్ అధినేత ఎం.ఆర్.గంగాధర్ తదితరులు శ్రీదేవమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**ప్రముఖుల పరామర్శ....**





శ్రీదేవమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి అనిల్‌కుమార్, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

అలాగే మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి తనయుడు ఏ.సి. సుబ్బారెడ్డి, మాజీ జడ్పీఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, కెన్సెస్ సంస్థల అధినేత నరసారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు తుంగా శివ ప్రభాత్‌రెడ్డి ఇంటికివెళ్లి ఆయనను పరామర్శించారు.

## ప్రముఖుల సంతాపం...

# అమ్మ లేని లోటు పూడ్చలేనిది

## - ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అమ్మ లేనిలోటు ఎవరూ తీర్చలేరని, మనిషికి అమ్మ భగవంతుడు ఇచ్చిన వరమని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శివప్రభాత్‌రెడ్డికి ఫోన్ ద్వారా సంతాపాన్ని తెలిపిన అయన తుంగా కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

అయన కుమార్తె దీపా వెంకట్ మాగుంట లేఅవుట్‌లోని ప్రభు ఇంటికి వెళ్లి శ్రీదేవమ్మ మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు.

# ఈ శోకం... తీర్చలేనిది

## - యస్.పి.బాలసుబ్రహ్మణ్యం

అమ్మంటే అనురాగం, అమ్మంటే ఆప్యాయత, అమ్మంటే అన్నీ అమ్మ లేని లోటు తీర్చలేనిది. ఆ బాధ అనుభవించిన వాడిని అంటూ భారతీయ సినిమా గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఫోన్ ద్వారా ప్రభుకి తన సంతాపాన్ని తెలిపారు.

# 'ప్రభా'తం

## అంతరిక్షంపై ఆధిపత్యం దిశగా...

**కోట్లాదిమంది భారతీయుల ఆశలను ఆకాంక్షలను మోసుకుంటూ వెళ్లిన చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. అంతరిక్ష చరిత్రలో భారత్ మరో అద్భుతఘట్టం ఆవిష్కరించింది. చంద్రుని మీదకు వెళ్లడం ఒక అందమైన కల. అక్కడ పరిశోధనలు చేపట్టేందుకు రాకెట్‌ను విజయవంతంగా పంపగలడం ఒక సాహసం. చంద్రయాన్-2 విజయంతో ఎన్నో ఏళ్లనాటి స్వప్నం సాకారమైనట్లయింది. ఈ అద్భుత విజయాన్ని సాధించిన భారత శాస్త్రవేత్తల కృషి అపూర్వం.. అమోఘం!. అద్వితీయం..!**



**జూలై 22, 2019...**

అంతరిక్ష చరిత్రలో భారత్ మరో అద్భుతఘట్టం ఆవిష్కరించిన రోజు. కోట్లాదిమంది భారతీయుల ఆశలను ఆకాంక్షలను మోసుకుంటూ వెళ్ళిన చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగం విజయవంతమైన రోజు. రాకెట్ నిర్ణీత కక్ష్యలోకి చేరి..ఈ ప్రయోగం తొలిదశ విజయవంతం కావడంతో భారతీయుల మనసులు ఆనందడోలికలూగాయి. త్వరలోనే వెన్నెలరేడుతో ఊసులాడనున్న మన ఉపగ్రహ వాహకనౌకలోని రోవర్‌ను తలుచుకుని ఆనందపారవశ్యం చెందాయి. దీంతో ఎన్నో ఏళ్ళనాటి ఒక స్వప్నం సాకారమైనట్లయింది. చంద్రుని మీదకు వెళ్ళడం ఒక అందమైన కల. అక్కడ పరిశోధనలు చేపట్టేందుకు రాకెట్‌ను విజయవంతంగా పంపగలడం ఒక సాహసం. ఆ అద్భుత సాహసాన్ని అమేయమైన పరిజ్ఞానంతో భారత శాస్త్రవేత్తలు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

'చంద్రయాన్-2' భారత అంతరిక్ష శాస్త్రవేత్తలకు ప్రతిష్టాత్మకమైన ప్రయోగం. కొద్దిరోజుల క్రితమే రోదసిలోకి దూసుకువెళ్ళాల్సిన ఈ రాకెట్ సాంకేతిక సమస్యల వల్ల చివరిగంటలో ప్రయోగం ఆగిపోయింది. అయినా శాస్త్రవేత్తలు ఏమాత్రం నిరాశ చెందలేదు. ఆహరహం శ్రమించి వారం రోజుల్లోనే ఆ లోపాలను సరిదిద్దుకుని, అవరోధాలను అధిగమించి ఎంతో ఆత్మవిశ్వాసంతో.. నూతనోత్సాహంతో మళ్ళీ రాకెట్ ప్రయోగానికి సంసిద్ధులయ్యారు. వారి సంకల్పబలానికి ప్రతీకగా జియో సింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్ఎల్‌వి) మార్క్-3 ఎం 1 వాహకనౌక శ్రీహరికోటలో ఉన్న షార్ రెండో ప్రయోగవేదిక మీద నుంచి నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోయింది. 43.43 మీటర్ల ఎత్తు, 640 టన్నుల బరువు ఉన్న జిఎస్ఎల్‌వి మార్క్-3 కేవలం 16.14నిమిషాల్లోనే చంద్రయాన్-2ను నిర్ణీత కక్ష్యలోకి చేర్చి విజయదరహాసం చేసింది. చంద్రయాన్-2 బరువు 3.8 టన్నులు. చంద్రయాన్-2 నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా చేరడంతో దేశమంతటా సంతోషం వెల్లువెత్తింది. బాహుబలి వాహకనౌకగా పేరుగాంచిన జిఎస్ఎల్‌వి మార్క్ 3, ఎం-1 రాకెట్ తనపై ఎంతో నమ్మకం పెట్టుకున్న ఇస్రో శాస్త్రవేత్తల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా వ్యోమనౌకను రోదసి లోకి మోసుకెళ్లే అత్యద్భుత దృశ్యాలను ప్రసారమాధ్యమాల్లో వీక్షించిన ప్రజలు ఈ విజయంతో పులకించిపోయారు. జయహో భారత్ అంటూ ఉప్పొంగిపోయారు. చంద్రునిపైకి మనదేశం చేపట్టిన చంద్రయాన్-2 యాత్రలో తొలి దశ విజయవంతం కావడాన్ని దేశవ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా కోటానుకోట్లమంది ప్రజలు వీక్షించి భారత్ శాస్త్రవేత్తల ప్రజ్ఞాపాటవాలను కొనియాడారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ విజయం..ప్రపంచ అంతరిక్ష పరిశోధనల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం. ఈ అత్యున్నత కీర్తికి భారత శాస్త్రవేత్తల అద్భుతమైన ప్రజ్ఞాపాటవాలే కారణం. ఈ ప్రయోగానికైన ఖర్చు మొత్తం 978 కోట్లు మాత్రమే. దాదాపు పదకొండేళ్ళ తర్వాత మళ్ళీ ఇప్పుడు భారత్ రెండోసారి చంద్రమండల యాత్ర స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశలో రాకెట్‌వేగంతో సాగుతూ ఉండడం ఎంతో శుభపరిణామం. రాకెట్ నుంచి విడిపోయిన వెంటనే చంద్రయాన్-2 అయిదురోజుల అనంతరం భూనియంత్రిత కక్ష్యలోకి వెళ్ళాక ఇక అక్కడి నుంచి 3 లక్షలా 84వేల కిలోమీటర్ల దూరానికి పైగా ఉన్న చందమామను చేరుకోవాల్సి ఉంది.ఈ ప్రయోగంలో చంద్రయాన్-2లోని ల్యాండర్, రోవర్ చంద్రునిపై దిగి పరిశోధనలకు ఉపక్రమించడం ఎంత అద్భుతమో!..చంద్రయాన్-2లో చంద్రుని చుట్టూ పరిభ్రమించే ఆర్బిటర్, దాని నుంచి విడిపోయి చంద్రుని ఉపరితలంపై దిగే ల్యాండర్, రోవర్ అనే అద్భుత యంత్ర పరికరాలను రూపొందించుకోవడంలో మన శాస్త్రవేత్తల కృషి అమోఘమైనది.

ఈ ప్రయోగం ద్వారా చంద్రుని పుట్టుక, భూమి, సౌరకుటుంబాల పుట్టుకతో పాటు వీటి పరిణామ క్రమానికి సంబంధించి ఎన్నో రహస్యాలను తెలుసుకునే వీలుంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదిన చంద్రునిపై ల్యాండర్ దిగనుంది. అందులోంచి రోవర్ వెలుపలకి వచ్చి 14 రోజుల పాటు చంద్రుని ఉపరితలంపై పరిశోధనలకు ఉపక్రమిస్తుంది. ఎంతో అద్భుతమైన ఈ ప్రయోగాన్ని దిగ్విజయంగా నిర్వహించడంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి అమోఘమైనదే కాదు.. అజేయమైనది కూడా. ఈ విజయం అనేక విజయాలకు సూచిక కాబోతోంది. భవిష్యత్తులో రష్యా, అమెరికా, చైనాల తర్వాత మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల్లో నాల్గవదేశంగా భారత్ కీర్తిని రెపరెపలాడించేందుకు భారత్ శాస్త్రవేత్తలు ప్రణాళికలు చేపట్టేందుకు కూడా ఈ ప్రయోగం స్ఫూర్తిదాయకమవుతుంది.

'జాబిల్లి దిశగా భారత్ చరిత్రాత్మక ప్రయాణానికి ఇది ఆరంభం'.. అంటూ ఇస్రో అధినేత శివన్ ఈ ప్రయోగ విజయం అనంతరం ధీమాగా చెప్పడం శాస్త్రవేత్తల ఆత్మవిశ్వాసానికి ప్రతీక. అనుకున్నదానికంటే 6వేల కిలోమీటర్ల మేర ఎక్కువ కక్ష్యలోనే వ్యోమనౌకను వదిలిపెట్టడం జరిగిందని, దీనివల్ల చంద్రయాన్-2కు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అంటూ మరో 45 రోజుల్లోనే అత్యంత కీలకమైన 15 విన్యాసాలను విజయవంతంగా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రయోగ దశలన్నీ కూడా విజయవంతం కావాలని మనసారా కోరుకుందాం!..

ఏదేమైనా, జాబిల్లి దక్షిణ ధృవంపై రోవర్‌ను దింపి పరిశోధనలు చేసే తొలి దేశంగా ప్రపంచంలోనే భారత్ త్వరలో మరో చరిత్ర సృష్టించబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకు నిరంతరం నిర్విరామంగా కృషిచేస్తున్న భారత శాస్త్రవేత్తలందరికీ జేజేలు!..

## నేత్రపర్వం.. సాయినాధుని గరుడోత్సవం

గురుపూర్ణిమ ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో కొలువైవున్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 21న సాయినాధునికి ఎంతో భక్తిశ్రద్ధలతో గరుడోత్సవం నిర్వహించారు. నేత్రపర్వంగా జరిగిన ఈ వేడుకలో తొలుత స్వామివారిని శోభాయమానంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య ఊరేగింపు నిర్వహించారు. శ్రీ సాయి సమాజం అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్య యాదవ్, మస్తానమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రావిళ్ళ రవీంద్రనాయుడు సహకారంతో భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## బుజబుజనెల్లూరులో...
## రక్తదాన శిబిరం



నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరులోని పిఎంపి కార్యాలయంలో ఈ నెల 21న రక్తదాన శిబిరం నిర్వహించారు. లక్ష్యం ఫౌండేషన్, పిఎంపి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వాసుపత్రి వైద్యుడు కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు ఇచ్చే రక్తం మరో ముగ్గురికి ప్రాణదానం చేస్తుందని అన్నారు. రక్తం ఆవశ్యకతను గుర్తించి యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ శిబిరంలో పలువురు పాల్గొని రక్తదానం చేశారు. స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షుడు ఇవిఎస్ నాయుడు, ఫౌండేషన్ అధ్యక్షుడు డి.చంద్రశేఖర్, పిఎంపి నాయకులు శాకవరపు వేణుగోపాల్, సత్తార్, శేషయ్య, ఆదిశేషు, ప్రసాదరావు, వెంకటనరసయ్య, జన్ని రమణయ్య, మహబూబ్‌బాషాతో పాటు రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## రాజన్న సంక్షేమ రాజ్యం తెచ్చిన
## జననేత జగన్

ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నెల రోజుల్లోనే రాష్ట్రాన్ని రాజన్న రాజ్యంగా మార్చేందుకు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. పాదయాత్రలో ప్రజల కష్టాలను తన కళ్ళారా చూసి ఆ సందర్భంలో వారికిచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో యస్సీ, యస్టీ, బి.సి, మైనార్టీ, కాపు, బ్రాహ్మణ కులాల వారి సంక్షేమానికి కోట్లాది రూపాయలు కేటాయించడం ద్వారా రాజన్న సంక్షేమ రాజ్యానికి నాంది పలికారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు, విలేజి వాలెంటీర్ల నియామకం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ తన పాలనలో అందరికీ ఉద్యోగం వస్తుందనే భరోసా కల్పిస్తున్నారు. అవినీతి అక్రమాలను ఎవ్వరు చేసినా ఒప్పుకోనని ఎమ్మెల్యేలైనా, మంత్రులైనా అవినీతి రహితంగా వుండాలని ఆదేశించడం ద్వారా పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారు. ఆదర్శపాలన దిశగా అడుగులు వేస్తున్న జననేత వైయస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలంతా దీవించాలని కోరుచున్నాను.

***డా॥ యస్.బాబురావు, కావలి.***

## పాస్టర్‌లకు జీతాలేంటి?

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాస్టర్‌లకు జీతాలెందుకు ప్రకటిస్తుందో అర్ధం కావడం లేదు. దేవాలయాలు దేవాదాయ పరిధిలోకి వస్తాయి కాబట్టి వాటి ఆలనాపాలనా ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వ అజమాయిషీ లేకుంటే దేవాలయాలకొచ్చే ఆదాయంతో సిబ్బందికి జీతాలిచ్చుకోవచ్చు. దేవాలయాలను ఇంకా అభివృద్ధి చేసుకోవచ్చు. దేవాలయాల సొమ్మే ఇంకా ప్రభుత్వం తింటోంది. చర్చిలపై కాని, మసీదులపై కాని ప్రభుత్వానికి నియంత్రణ లేదు. చర్చిలకు అధికార బద్ధత లేదు. పాస్టర్‌లకు జీతాలంటూ ఎంత మందికి ఇస్తారు. వీధికి నాలుగు లెక్కన చర్చిలు కట్టివున్నారు. ఈ చర్చిల పాస్టర్‌లందరికీ ఇలా జీతాలిచ్చుకుంటూ పోతే ప్రజలు కట్టే పన్నులు వాళ్లకే సరిపోతాయి పాస్టర్‌లకు, పూజారులకు కాదు నెలకు వేతనాలివ్వాల్సింది. దేశానికి తొలి ఉత్పత్తిదారుడు రైతు. ఆ రైతు కోసం ఈ డబ్బు ఖర్చు చేయండి. ఫలితముంటుంది.

***శనగవరపు కేశవ్, ఒంగోలు.***

## ఇస్రోకు అభినందనలు

అంతరిక్ష రంగంలో భారతదేశ కీర్తిని ఇనుమడింపజేసేలా చంద్రయాన్-2 ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాభినందనలు. చంద్రయాన్-2 ప్రయోగంతో ఇస్రో శాస్త్రవేత్తల శ్రమ ఫలించింది. భవిష్యత్‌లో మరెన్నో సాహసోపేత ప్రయోగాలకు ఇది ఊతమిస్తుంది.

***- ఎల్.శివాజీ, నెల్లూరు.***

## సమగ్ర సర్వే సముచిత నిర్ణయం

రాష్ట్రంలో భూములన్నింటిపై సమగ్ర సర్వే నిర్వహించి, భూ వివరాలను కట్టుదిట్టం చేయాలనుకొంటున్న ప్రభుత్వ నిర్ణయం ఎంతో సముచితమైంది. రెవెన్యూ రికార్డుల్లో భూముల వివరాలు గందరగోళంగా వుంటున్నాయి. రెవెన్యూ రికార్డులు సరిగా లేక ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. గ్రామాలలో పొలాల విషయంలో తగాదాలు వస్తున్నాయి. రెవెన్యూ రికార్డులలో లోపాల వల్లే వ్యవస్థలోనూ అవినీతి పెరిగిపోయింది. భూ రికార్డులను పక్కాగా తయారు చేస్తే వీటన్నింటికి తెరదించినట్లే!

***జి.ఎస్.రెడ్డి, నెల్లూరు.***

# పదవులు పంచేదెప్పుడు?



రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలవుతోంది. కార్యకర్తలు, అభిమానుల కష్టం ఫలించి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. కొందరు ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు. ఎన్నికలకు ముందు జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాడు.

ఇదంతా బాగానే వుంది. జగన్మోహన్‌రెడ్డికి ఓటరుకు మధ్య ఒక వారధి ఉంటుంది. ఆ వారధికి పిల్లర్లు ద్వితీయ శ్రేణి నాయకులైతే కాంక్రీట్ స్లాబ్‌లాంటి వాళ్ళు కార్యకర్తలు. ఎన్నికలకు ముందంతా పార్టీ జెండాలు మోసేది వీళ్లే! అప్పటి అధికార పార్టీ నాయకులు చేతుల్లో తన్నులు తిన్నది వీళ్ళే! అక్రమ కేసులకు గురై పోలీసుస్టేషన్‌లకు వెళ్లింది వీళ్ళే! ఓట్లేయించుకున్నోళ్ళు ప్రజా ప్రతినిధులయ్యారు. ఓట్లేసిన ప్రజలు సంక్షేమ పథకాలు పొందుతున్నారు. మధ్యలో వుండి చాకిరిచేసినవారి పరిస్థితేంటి? ఇప్పుడు వైసిపిలో ఇదే పెద్ద చర్చగా వుంది.

అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికారపార్టీ నాయకులు నాలుగు రూపాయలు సంపాదించుకునే అవకాశాలకు ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తెరదించాడు. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా, నిన్నటి ఐదేళ్ళ తెలుగుదేశం ప్రభుత్వంలోనైనా ద్వితీయ శ్రేణి కేడర్ నాలుగు రూపాయలు సంపాదించుకునేది ఇసుక కాంట్రాక్ట్‌లు, మద్యం వ్యాపారాల ద్వారానే! అధికార పార్టీ ఒత్తిళ్ళు బాగా పనిచేసేది ఈ రెండు వ్యాపారాల మీదే! అయితే జగన్ వచ్చి ఈ రెండు వ్యాపారాలను కూడా ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంటున్నాడు. ఇకముందు ప్రభుత్వమే ఇసుక, మద్యం అమ్మకాలు సాగిస్తుంది. దీంతో వైసిపి కోసం ఇంతకాలం కష్టపడ్డ ద్వితీయశ్రేణి నాయకులకు, కార్యకర్తలకు వ్యాపారాలు చేసుకునే అవకాశం లేకుండాపోయింది.

ఇక వున్న ఆశల్లా నామినేటెడ్ పదవులు. జిల్లాలో ఒకటి అరా తప్ప నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. నుడా ఛైర్మెన్, ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వంటి జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులతో పాటు మరెన్నో దేవాలయాల పాలకవర్గ కమిటీల పదవులు భర్తీ చేయాల్సి వుంది. అలాగే కొందరు నాయకులు ఎమ్మెల్సీ వంటి పదవుల రేసులో కూడా వున్నారు. జిల్లాలో ఆనం విజయకుమార్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పొణకా శివకుమార్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి వంటి వాళ్ళు ఎమ్మెల్సీ పదవుల రేస్‌లో వుండగా, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ పదవికి కూడా పలువురు పోటీపడుతున్నారు. వీరిలో ఒక ఎమ్మెల్యే కూడా వుండడం విశేషం.

ఇక జిల్లాలో ఆయా దేవస్థానాల పాలకవర్గాలను భర్తీ చేయాల్సివుంది. ఇంకొన్ని దేవాలయాలకు పాత పాలకవర్గాలే వున్నాయి. తొందరగా దేవాలయాల పాలక కమిటీలను నియమిస్తే ఎక్కువ సంఖ్యలో వైసిపి గెలుపు కోసం కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు అవకాశాలిచ్చినట్లవుతుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక నామినేటెడ్ పదవుల భర్తీకి సీఎం శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నెల్లూరుజిల్లాలో...
# కోస్తా టూరిజం సర్క్యూట్ పరిస్థితేంటి?



### రాజ్యసభలో కేంద్రమంత్రిని నిలదీసిన విపిఆర్

స్వదేశీ దర్శన్ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కోస్తా టూరిజం ప్రాజెక్ట్ సర్క్యూట్ పనులు నెల్లూరుజిల్లాలో ఏ దశలో వున్నాయని పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. 23వ తేదీ రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ అంచనా ఎంత? ఖర్చు ఎంత? ఈ ప్రాజెక్ట్ నెల్లూరుజిల్లాలో ఎప్పటిలోగా పూర్తవుతుందో చెప్పాలని నిలదీశారు. దీనిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో కోస్తా టూరిజం సర్క్యూట్ ప్రాజెక్ట్ అమలులో వుందని, ఇప్పటివరకు ప్రాజెక్ట్ కోసం చేపట్టిన పనులలో 80శాతం మేర భౌతిక పురోగతిని సాధించడం జరిగిందన్నారు. కోస్తా సర్క్యూట్ థీమ్ క్రింద 2015-16 సంవత్సరానికి 59.70 కోట్లు నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో వాటర్ ఫ్రంట్ ప్రోమెనీడ్, అప్రోచ్‌రోడ్, టూరిస్ట్ ఫెసిలిటేషన్, రిసెప్షన్ సెంటర్‌లు, హస్తకళల ప్రదర్శన కేంద్రాలు, సిటింగ్ ప్లాజా, ల్యాన్‌స్కేపింగ్, సోలార్ ఫిటింగ్, వాచ్‌టవర్ సదుపాయాలు వుంటాయని వెల్లడించారు. అలాగే వేమిరెడ్డి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కడప సర్క్యూట్‌లపై కూడా కేంద్రమంత్రిని ప్రశ్నించారు.

సభలో అంతకుముందు వేమిరెడ్డి బొగ్గు కంపెనీలలో వివాదాల గురించి, అక్కడ పని చేస్తున్న కార్మికుల హక్కుల గురించి ప్రశ్నించారు. ఏపిలో నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్టిట్యూషన్ ఏర్పాటుపై కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను ప్రశ్నించి ఆయన నుండి సమాధానం రాబట్టారు. డిజిటల్ చెల్లింపుల కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భీమ్‌యాప్ వినియోగం గురించి, చేనేత కార్మికుల సమస్యల గురించి ఆయన సభలో ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఆగస్టు 1 నుండి రిజిస్ట్రేషన్ బాదుడు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు, ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు స్థలం కొనుగోలు చేసేంత వుంటే మరలా రిజిస్ట్రేషన్ బాదుడుకు రంగం సిద్ధమైంది. నెల్లూరు జిల్లాలో భూ విలువలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి పెరిగిన విలువలు అమల్లోకి రానున్నాయి. ఈ ఏడాది పట్టణ ప్రాంతాల్లో 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం వరకు పెంచేందుకు అధికారులకు ప్రభుత్వం సంకేతాలిచ్చింది. నెల్లూరు, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లాల పరిధిలో మొత్తం 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. భూ క్రయ, విక్రయాలు, సెటిల్‌మెంట్లు, లీజు, పవర్ ఆప్ అటార్నీ తదితర కార్యకలాపాల ద్వారా జిల్లాలోని ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నెలకు దాదాపు రూ.15 కోట్ల నుంచి రూ20 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. 2019-2020 సంవత్సరానికి సంబంధించి రిజిస్ట్రేషన్ విలువలు బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా పెంచే యోచనలో ఉన్నారు. నెల్లూరు నగరం, రూరల్, కోవూరు, బుజబుజనెల్లూరు, కావలి, గూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, నాయుడుపేట, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో భూ విలువలు భారీగా పెరిగే అవకాశాలున్నాయి.



## ఎయిర్‌పోర్టు...
# ఎక్కడిదాకా వచ్చిందో?

మూడు ప్రభుత్వాలు మారాయి... నలుగురు ముఖ్యమంత్రులు పోయి ఐదో ముఖ్యమంత్రి కూడా వచ్చాడు.... నెల్లూరుజిల్లాలో ఎయిర్‌పోర్టు అనే కల మాత్రం ఇంకా కలగానే వుంది. పదేళ్లుగా అది ప్రతిపాదనలకు, పత్రికల్లో పతాక శీర్షికలకు మాత్రమే పరిమితమవుతోంది.

దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని నిర్ణయించడం తెలిసిందే! ఎయిర్‌పోర్టు పనులను అప్పట్లో సత్యం గ్రూప్‌కు చెందిన 'మైటాస్'కు అప్పగించడం, సత్యం గ్రూప్ దివాళా తీయడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణంలో ప్రతిష్టంభన ఏర్పడడం తెలిసిందే! ఆ తర్వాత వై.యస్. రాజశేఖరరెడ్డి మరణంతో ఈ ప్రతిపాదన తెరమరుగైంది. 2014 వరకు వై.యస్. తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు ముఖ్యమంత్రులుగా వచ్చారు. దామవరం ఎయిర్‌పోర్టు విషయం అంగుళం కూడా ముందుకు కదల్లేదు.

2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఎయిర్‌పోర్టు విషయం కొంచెం ముందుకు కదిలింది. భూ సేకరణ విషయంలో వున్న సమస్యలను కొంత అధిగమించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనిని నెల్లూరు ఎయిర్‌పోర్టు అథారిటి అనే కంపెనీ చేపట్టింది. అయితే తెలుగుదేశం ప్రభుత్వం పడిపోయేలోపు సీఎంగా వున్న చంద్రబాబు నాయుడు దామవరం ఎయిర్‌పోర్టుకు కనీసం శంకుస్థాపన కూడా చేయలేకపోయారు.

ఇప్పుడు వై.యస్.రాజశేఖరరెడ్డి తనయుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సీఎంగా వచ్చాడు. దామవరం ఎయిర్‌పోర్టు అన్నది వై.యస్. సంకల్పమే. దానిని నెరవేర్చే అవకాశం ఇప్పుడు కొడుకుగా జగన్‌కు వచ్చింది. వీలైనంత త్వరలో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన, నిర్మాణ పనులు మొదలయ్యేలా చూడాల్సివుంది. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు ఎయిర్‌పోర్టులున్నాయి. నెల్లూరు నుండి నిత్యం హైదరాబాద్, చెన్నై, ముంబై, విజయవాడలకు ప్రయాణీకులు ఎక్కువగా వుంటారు. విమాన ప్రయాణీకులందరు కూడా ప్రస్తుతానికి తిరుపతి, లేదంటే చెన్నై ఎయిర్‌పోర్టుల మీద ఆధారపడుతున్నారు. నెల్లూరుకు ఎయిర్‌పోర్ట్ వస్తే ఖచ్చితంగా ఇక్కడ నుండి సర్వీసులు పెంచే విధంగా విమాన ప్రయాణీకులు పెరుగుతారు.

# నార్త్‌మోపూరులో బడిబాట



విద్యార్థినులకు సైకిళ్ళను పంపిణీ చేస్తున్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

ఈ నెల 23వ తేదీన నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామమైన అల్లూరు మండలం నార్త్‌మోపూరులోని జడ్పీ హైస్కూల్‌లో రాజన్న బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తాను నార్త్‌మోపూరు నుండి అల్లూరుకు నడిచి వెళ్లి చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఆరోజుల్లో పెద్దగా సౌకర్యాలుండేవి కావని, చదువుకోవడానికి ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేదన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌కు ధీటుగా ఈ హైస్కూల్ విద్యార్థులు ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని 75 మంది విద్యార్థినులకు 75 సైకిళ్లను, 6 నుండి 8వ తరగతి వరకు విద్యార్థినులకు యూనిఫారమ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రాజ్యలక్ష్మి, మధురెడ్డి, వెంకటేశ్వర్లు, అబ్దుల్, శివకుమార్ పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## పోస్టర్లే కాదు...
# ఫ్లెక్సీలు కూడా ముంచేస్తున్నాయి



నెల్లూరు నగరాన్ని పోస్టర్ ఫ్రీ నగరంగా మార్చాలని చెప్పి నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి కంకణం కట్టుకున్నారు. మంచిదే. అభినందించాల్సిందే! ఈ మేరకు ఆయన మొన్నామధ్య సినిమా హాళ్ళ యాజమాన్యంతో కూడా సమావేశాలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో గోడలపై పోస్టర్లు అంటించవద్దని వారికి సూచించారు కూడా! అయితే ఇప్పుడు గోడలపై సినిమా పోస్టర్ల కంటే కూడా మతప్రచార సభల పోస్టర్లు ఎక్కువుగా కనిపిస్తున్నాయి. వీళ్ళు ఏ గోడలను వదలరు. ఆఖరకు నగరంలో ప్రముఖుల విగ్రహాలుండే ఐల్యాండ్‌లను కూడా వదలకుండా పోస్టర్లతో ముంచేస్తున్నారు. ముందు వీటిని అరికట్టండి.

అలాగే ఇప్పుడు వాల్‌పోస్టర్లకంటే ఫ్లెక్సీలు అలకడం ఎక్కువైంది. ఎక్కడపడితే అక్కడ, దేనికి పడితే దానికి ఫ్లెక్సీలు వేసేస్తున్నారు. ఈ ఫ్లెక్సీలలో రాతలు చూస్తుంటే రోత కలుగుతోంది. రోడ్ల మీద ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు లేకుండా కేవలం కార్పొరేషన్ అనుమతి పొందిన హోర్డింగ్‌లపై మాత్రమే ఫ్లెక్సీలు వేసుకునేలా చేయండి. అవసరమైతే హోర్డింగ్‌లు పెంచడానికి అనుమతించండి. ఫీజులు వసూలు చేసి హోర్డింగ్‌లకు లైసెన్స్‌లివ్వండి. హోర్డింగ్‌లు కూడా భద్రతా కోణంలోనే ఏర్పాటు చేసేలా చూడండి.

## నెల్లూరు కబుర్లు

## చంద్రయాన్ విజయంతో...
# విద్యార్థుల ఆనందం



చంద్రయాన్ విజయవంతం కావడంతో నెల్లూరు రూరల్ పరిధిలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న కెవిఆర్ నగరపాలక సంస్థ ఉన్నతపాఠశాలలో విద్యార్థులు ఆనందాతిరేకాలు వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా చంద్రయాన్-2 రాకెట్ ప్రయోగాన్ని చూపడంతో అంతరిక్షంలోకి దూసుకువెళ్తున్న రాకెట్ గమనాన్ని చూస్తూ విద్యార్థులు ఎంతో ఆనందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా చంద్రయాన్ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసిన షార్ శాస్త్రవేత్తలను కొనియాడారు.

కాగా, చంద్రయాన్ ప్రయోగం విజయవంతం చేసినందుకు సంతోషిస్తూ బుజబుజనెల్లూరు లోని దూడల వెంకటనరసయ్య మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 'షార్' అక్షరాల ఆకృతిలో ఆశీనులై భారత శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## మాడరన్‌స్కూల్‌లో
# బోనాల పండుగ



వానలు బాగా కురిసి చక్కని పంటలతో భూమాత కళకళలాడాలని ఆ జగన్మాతను కోరుకుంటూ చేసే బోనాల పండుగను నెల్లూరులోని మాడరన్‌స్కూల్‌లో ఈనెల 19న ఎంతో వేడుకగా నిర్వహించారు. నెల్లూరు ప్రాంతంలో కూడా వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఈ పండుగ నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నుడా వీసీగా బాపిరెడ్డి

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ(నుడా) వైస్ ఛైర్మెన్‌గా టి.బాపిరెడ్డిని నియమించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ విభాగంలో పనిచేస్తూ ఆయన నుడాకు బదిలీ అయ్యారు. ఆయన గతంలో ఆత్మకూరు ఆర్డీఓగా కూడా పని చేశారు. నుడా వీసీగా వున్న అరుణ్‌బాబును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

# ఆర్డీఓ బదిలీ

నెల్లూరు ఆర్డీఓ చిన్నికృష్ణను కాకినాడ ఆర్డీఓగా పంపించారు. వెయిటింగ్‌లో వున్న హుస్సేన్ సాహెబ్‌ను నెల్లూరు ఆర్డీఓగా నియమించారు. నాయుడుపేట ఆర్డీఓ శ్రీదేవిని పదోన్నతిపై విశాఖపట్నం డిఆర్‌ఓగా బదిలీ చేశారు. డ్వామా పిడిగా పని చేస్తున్న సరోజనిదేవిని నాయుడుపేట ఆర్డీఓగా నియమించారు.

# చేనేత ఏడీగా శ్రీనివాసరావు

జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీగా బి.శ్రీనివాసరావు సోమవారం నెల్లూరు, రైల్వేఫీడర్స్ రోడ్డులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ శాఖలోని అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## నగర డిఎస్పీగా
# శ్రీనివాసులురెడ్డి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు నగర డిఎస్పీగా జె.శ్రీనివాసులురెడ్డి 21వ తేదీ నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం పోలీస్ శిక్షణ కళాశాల డిఎస్పీగా పనిచేస్తూ ఆయన నెల్లూరుకు బదిలీ అయ్యారు. చిత్తూరుజిల్లా పుంగనూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి 1989లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. కడప జిల్లాలో ఎస్ఐగా, సి.ఐగా ఎక్కువ కాలం పని చేశారు. కొంతకాలం తిరుపతి ఏసిబి సిఐగా కూడా పని చేశారు. 2011లో డిఎస్పీగా పదోన్నతి పొందారు. పొద్దుటూరు, ఆదోని, అనంతపురం ఇంటలిజన్స్ డిఎస్పీగా పని చేశారు. అనంతపురం పిటిసి డిఎస్పీగా పని చేస్తూ ఇప్పుడు నెల్లూరొచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్పీ ఐశ్వర్య రస్తోగిని, ఏఎస్పీ పరమేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే నగరంలోని సిఐలు శ్రీనివాసన్, వేమారెడ్డి, నాగేశ్వరరావు, సోమయ్య, అన్ని స్టేషన్‌ల ఎస్.ఐలు డిఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

# అట్రాసిటీ కమిటీలో కిరణశ్రీ



జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులుగా సాహితీవేత్త విద్వాన్ బూతపాటి కిరణశ్రీని జిల్లా కలెక్టర్ నియమించారు. కిరణశ్రీ యునెస్కో నెల్లూరు శాఖ అధ్యక్షునిగాను, న్యూఢిల్లీలోని కాన్ఫడరేషన్ ఆఫ్ యునెస్కో క్లబ్స్ అసోసియేషన్‌కు జాతీయ కార్యవర్గ సభ్యునిగానూ పని చేస్తున్నారు. నెల్లూరులో పద్మభూషణ్ గుర్రం జాషువా ప్రజాగ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్నో రచనలు, వ్యాసాలు రాశారు. రచయితగా అందరికీ సుపరిచితుడే!

## రైతుల కోసం
# టోల్‌ఫ్రీ నెంబర్

జిల్లాలో రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు చొరవ తీసుకుని హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. పంట ఋణాలు, ఋణాల రీషెడ్యూల్ వంటి అంశాలలో ఎలాంటి సమస్యలున్నా రైతులు 1800 4223363 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పొచ్చు. పాడి, మత్స్య, ఉద్యానవనాలకు సంబంధించిన రైతులు కూడా ఈ నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకోవచ్చు.



## ఫైల్స్ రాక్‌లను
# పరిశీలించిన కలెక్టర్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫైల్స్ రాక్‌లను జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు సోమవారం పరిశీలించారు. ఫైళ్లను క్రమ పద్ధతిలో సక్రమంగా పెట్టాలని సిబ్బందికి సూచించారు. ర్యాక్‌లలో తప్ప బయట ఎక్కడా ఫైళ్ళు కనిపించకూడదని, ఫైళ్ళ నిర్వహణ బాగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రియాంక అరెస్ట్‌పై
# కాంగ్రెస్ ధర్నా



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సోన్‌భద్ర జిల్లా సపాహి అనే గ్రామంలో భూ తగాదా విషయంలో బీజేపీ వారి చేతిలో దాడికి గురైన బాధితులను పరామర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ 20వ తేదీ జిల్లా కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రాస్తారోకో జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.వి.శేషారెడ్డి, రఘురాం ముదిరాజ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫయాజ్, సర్ఫరాజ్, లతారెడ్డి, షబ్బీర్, అల్లావుద్దీన్, మున్నా, అశోక్, గణేష్ తదితరులు పాల్గన్నారు.

## మంత్రిని కలసిన
# రిటైర్డ్ పోలీసు అధికారులు

జిల్లాలోని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు మోహన్‌రావు, శౌరీ రాములు, సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రాజు, అల్లాబక్షు తదితరులు 21వ తేదీన నెల్లూరులో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిశారు. తమకున్న సమస్యలను వారు మంత్రి అనిల్‌కు చెప్పుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# వానల్లు కురవాలి వానదేవుడా!
## మూలస్థానేశ్వరాలయంలో వరుణయాగం

వానల్లు కురవాలి వానదేవుడా..అంటూ నెల్లూరులోని మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 22న వరుణయాగం, రుద్రయాగం, సహస్ర ఘటాభిషేకం ఎంతో వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి వర్షాలు బాగా కురవాలని భగవంతుని ప్రార్థిస్తూ ఈ యాగాలు పూజలు చేపట్టారు. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో భాగంగా 1008 ఘటాలతో జలాలను తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం పూర్ణాహుతిని సమర్పించారు. ప్రత్యేకంగా ఆ పరమేశ్వరుని సహస్రనామ పారాయణ, గంగాదేవి నామపారాయణం, సుబ్రహ్మణ్యస్వామి నామ పారాయణం జరిగాయి. మహాభారతంలోని విరాటపర్వాన్ని కూడా పారాయణం చేశారు.

ప్రముఖ వేదపండితులు మురళీకృష్ణ, గోపీనాథం మల్లికార్జునశర్మ, పులిగొండ్ల వాసుదేవశర్మల ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ఇ.ఓ వేణుగోపాల్ పర్యవేక్షణలో జరిగిన ఈ విశిష్టపూజల అనంతరం యాగాలను నిర్వహించిన వేదపండితులను ఘనంగా సత్కరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ యాగాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో..
# కృష్ణాష్టమి పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మందిరం అధ్యక్షులు డాక్టర్ శుకదేవ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4వ తేదీ ఆదివారం ఇస్కాన్ మందిరంలో ప్లేక్లాస్, 1వ తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, 2 నుండి 5వ తరగతి విద్యార్థులకు శ్లోక పఠనం, కలరింగ్ పోటీలు, 6, 7 తరగతుల విద్యార్థులకు కలరింగ్ పోటీలు, 9, 10 తరగతుల విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు, 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు పాట్, డియా డెకరేషన్, సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున నిర్వహించే వేడుకలలో బహుమతులందజేస్తామన్నారు.




# శ్రీసిటీలో మరో కొత్త పరిశ్రమ

## - జపాన్‌కు చెందిన 'తొహోకు స్టీల్స్' ప్రారంభం

శ్రీసిటీలో మరో కొత్త పరిశ్రమ ప్రారంభమైంది. జపాన్‌కు చెందిన తొహోకు స్టీల్ కంపెనీకి అనుబంధమైన తొహోకు స్టీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఈ నెల 19న ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆ కంపెనీ ఎం.డి హీరోకి యమడ, ప్రెసిడెంట్ షింజి నరుసి, డైడో స్టీల్ వైస్‌ప్రెసిడెంట్ సుకసా నషీమురో తదితరులతో పాటు శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్స్ రిలేషన్స్) రమేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తొహోకు స్టీల్స్ సంస్థ బృందానికి ఒక ప్రకటనలో తన అభినందనలు తెలిపారు. సుమారు 80 కోట్లరూపాయల వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మించారని ఆయన పేర్కొంటూ శ్రీసిటీలో ఏర్పాటైన ఈ ప్లాంట్ భారత్‌లో తొహోకు స్టీల్స్ సంస్థకు చెందిన మొట్టమొదటిదని, ఆటోమొబైల్ రంగానికి చెందిన తయారీ రంగ పరిశ్రమలో ఇది మరొకటని సంతోషం వ్యక్తం చేశారు.

# వెంకయ్య ఆశ్రమంలో ఆనం



వెంకయ్యస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి 20వ తేదీ వెంకటాచలం మండలం, గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. స్వామివారి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. ఆశ్రమానికి విచ్చేసిన ఆనంకు ఆశ్రమ ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఆశ్రమం వద్ద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, వైసిపి నాయకులు కనుపూరు కోదండరామిరెడ్డి, కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య, కోడూరు ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీకి త్వరలో విద్యుత్ బస్సులు

## - ఆర్టీసీ యం.డి ఎన్.వి.సురేంద్రబాబు

కాలుష్య నివారణ కోసం విద్యుత్ వాహనాల వైపు అందరూ మొగ్గు చూపుతున్న తరుణంలో ఆర్టీసీని కూడా అదే బాటలో నడిపించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్టీసీ యం.డి ఎన్.వి.సురేంద్రబాబు తెలిపారు. 22వతేదీ షార్‌లో చంద్రయాన్–2 ప్రయోగాన్ని వీక్షించేందుకు వచ్చిన ఆయన ఈ క్రమంలో వాకాడు ఆర్టీసీ డిపోను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. తొలుత ఏపి ఆర్టీసీకి వెయ్యి బస్సులు కావాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. నష్టాల్లో వున్న ఆర్టీసీని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా వుందని, ఆర్టీసీ నష్టాలను ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన స్పందించి ఆర్టీసీకి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించారన్నారు. రాష్ట్రంలోని 120 డిపోలలో సమస్యలు వున్నాయని, అన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఇడి జి.వి.రావు, ఆర్ఎం రామం, డిఎం జి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సు'జలం' నా స్వప్నం

## కుసుమహరిజనవాడలో నీళ్ల శాఖ మంత్రి అనిల్‌తో కలిసి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన విపిఆర్



మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అనిల్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే తన లక్ష్యమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 20న నెల్లూరు నగరం 9వ డివిజన్‌లోని కుసుమ హరిజనవాడలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాలలో 88 వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రతి గ్రామానికి విపిఆర్ ఫౌండేషన్ చేయూతనందిస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ గురించి ప్రస్తావిస్తూ చిన్నతనంలోనే రాజకీయాల్లోకి వచ్చిన అనిల్ ప్రజాభిమానాన్ని చూరగొన్నారని, ఐదేళ్లు పూర్తికాలం మంత్రిగా జిల్లాకు, నగర ప్రజలకు సేవలందిస్తాడని చెప్పారు.



మహిళలకు బిందెతో నీళ్ళనందిస్తున్న అనిల్, వేమిరెడ్డి

మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ఏ మారుమూల ప్రాంత ప్రజలు వచ్చి, మంచినీటి సమస్య వుందని చెప్పినా కాదనకుండా మినరల్ వాటర్‌ప్లాంట్లు పెట్టిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అపరభగీరధుడిగా అభివర్ణించారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు ఆయన చేస్తున్న సేవలు నిరుపమానమన్నారు. ఆయన ఆశీస్సులు, సహకారంతోనే తాను ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైసిపి నాయకులు పి.రూప్‌కుమార్‌యాదవ్, దామవరపు రాజశేఖర్, తిప్పిరెడ్డి రఘురామిరెడ్డి, వంగాల శ్రీనివాసులురెడ్డి, నూనె మల్లిఖార్జునయాదవ్, నారాయణ, గాదంశెట్టి గోపాల్, ఈదల ధనూజ, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి, చీఫ్ కో–ఆర్డినేటర్ ఎన్.శంకర్, జిఎం పిఆర్ఓ రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● డిఎడ్ కౌన్సిలింగ్‌లో...

# స్థానం కల్పించకపోవడం అన్యాయం

## ఎన్‌బికెఆర్ కరస్పాండెంట్ రామ్

అన్ని అర్హతలు వున్న తమ ఎన్‌బికెఆర్ డిఎడ్ కళాశాలకు మొదటి రెండు విడతల కౌన్సిలింగ్‌లో స్థానం కల్పించకపోవడం అన్యాయమని ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 22వ తేదీ కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామరెడ్డి డిఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌన్సిలింగ్‌కు అవసరమైన అన్ని అర్హతలు తమ కళాశాలకు వున్నాయన్నారు. ఆరు మీటర్ల ఎత్తుకన్నా తక్కువ ఎత్తు వుండి, క్రింది అంతస్తులో తరగతులు నిర్వహించే కళాశాలలకు ఫైర్ ఎన్‌ఓసి అవసరం లేదని 2017 డిసెంబర్ 7వ తేదీన అప్పటి ఫైర్ సర్వీస్ డిజి ఉత్తర్వులు ఇచ్చారని, ఈ ఉత్తర్వులకు లోబడి తమ కళాశాల ఉన్నందుకు ఫైర్ ఎన్‌ఓసి నుండి తమ కళాశాలను మినహాయించాలని 2018 జూన్ 14న ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా లేఖ పంపామన్నారు. దీనిపై తదుపరి ఉత్తర్వులు ఇవ్వాలని ఎస్‌సిఇ ఆర్‌టి డైరెక్టర్ ఈ ఏడాది మార్చి16న లేఖ వ్రాశారని, అయితే స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మొదటి కౌన్సిలింగ్ ఈనెల 7 నుండి 9వతేదీ వరకు పూర్తి చేశారని,



ఇప్పుడు నిర్వహిస్తున్న రెండో కౌన్సిలింగ్‌లోనూ తమకు అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. నిబంధనలకు లోబడి తమ డిఎడ్ కళాశాల ఉన్నందున ప్రభుత్వం జోక్యం చేసుకుని కౌన్సిలింగ్‌లో అవకాశం కల్పించాలని, తమ కళాశాలకు అవకాశమివ్వకపోవడం వల్ల అనేక మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు టీచర్స్ ట్రైనింగ్ ప్రవేశాలను కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు.



# 108 సమ్మె

ప్రజలకు అత్యవసర సేవలు అందించే 108 అంబులెన్స్ ఉద్యోగులు సోమవారం రాత్రి నుండి సమ్మెకు దిగారు. 13ఏళ్లుగా 108 ద్వారా అత్యవసర సేవలు అందిస్తున్నప్పటికీ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదంటూ జిల్లాలోని 127 మంది సిబ్బంది సమ్మెలోకి దిగడంతో జిల్లా వ్యాప్తంగా వున్న 29 అంబులెన్స్ వాహనాలు నిలిచిపోయాయి.





తెలుగు భాషకు విశిష్ట సేవలందిస్తున్నందుకుగాను సత్కారాలనందుకున్న ప్రముఖులు

## తెలుగుభాషకు..
# సిపి బ్రౌన్ సేవలు చిరస్మరణీయం

ఆంగ్లేయుడైనప్పటికీ సిపి బ్రౌన్ తెలుగుభాషకు, తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పూర్వ పాలకమండలి సభ్యులు, అన్నదాత మణి(ప్రాస మణి) అన్నారు. సిపిబ్రౌన్– తెలుగుభాష అనే అంశంపై సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న నెల్లూరు టౌన్‌హాలులోని రీడింగ్‌రూంలో జరిగిన సభలో ఆయన తనదైన శైలిలో మాట్లాడుతూ మరుగునపడివున్న అనేక శాసనాలను, మంచి ముత్యాల్లాంటి వేమన పద్యాలను, ఇతరత్రా అనేకమైన విశిష్ట రచనలను వెలికితీసి తెలుగుభాషకు సిపి బ్రౌన్ మహోపకారం చేశారన్నారు. తెలుగుభాషకు ఆ మహనీయుడు చేసిన కృషి ఏనాటికీ మరువరానిదన్నారు. సిపి బ్రౌన్ సేవలను స్మరించుకుంటూ కవిసమ్మేళనంతో పాటు ఈ కార్యక్రమం చేపట్టిన సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్‌వారు అభినందనీయులన్నారు.

అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు ఎస్.రామమూర్తి, ప్రభాకర్‌రావు, శివకుమార్ తదితరులు ప్రాసలతో.. తన అద్భుతమైన ప్రసంగంతో అందరి కరతాళధ్వనులందుకున్న అన్నదాత మణిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగుభాషకు విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ రచయితలు అవధాని కోట రాజశేఖర్, కొత్రపాటి వెంకట రమణ, త్వరకవి బాలకృష్ణ, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడులను ఘనంగా సన్మానించారు. ఏపియుడబ్ల్యుజె నాయకుడు ఏ.జయప్రకాష్, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ, ఆచార్య ఆదిత్య, మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, ఈతకోట సుబ్బారావు, గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు. తొలుత జరిగిన కవిసమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొని తెలుగుభాషకు సిపిబ్రౌన్ చేసిన సేవలను కొనియాడుతూ కవితాగానం చేశారు.

# వెల్ఫేర్ నెట్‌వర్క్ సేవలు అభినందనీయం

**- ఎమ్మెల్యే వరప్రసాద్**




మెమొంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, బత్తిని విజయకుమార్, షేక్ రియాజ్ తదితరులు

పేద ముస్లిం విద్యార్థులకు చేయూతనందిస్తున్న మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ సేవలు అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఈనెల 21న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా 8, 9, 10తరగతుల ముస్లిం విద్యార్థులకు 84 మందికి రెండు జతల డ్రెస్ మెటీరియల్, టెన్త్‌లో ఉత్తమ జిపిఎ సాధించిన 14 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ఈ సంస్థ ఎంతో అభినందనీయమైనదన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలను అందుకోవాలన్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత పదేళ్ళుగా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా సంస్థద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ వెల్ఫేర్ నెట్‌వర్క్ ద్వారా అనేకమంది విద్యార్థుల అభ్యున్నతికి ప్రోత్సాహం అందిస్తుండడం సంతోషకరమన్నారు. సంస్థ అధ్యక్షుడు రహీం, మహబూబ్‌బాషా, మహమ్మద్ అన్వర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## సిలికా అక్రమ రవాణాపై
# ఉక్కుపాదం

**- డిఎస్పీ భవాని హర్ష**



పోలీసు అధికారులతో చర్చిస్తున్న గూడూరు డిఎస్పీ భవాని హర్ష

తీరప్రాంత గ్రామాల్లో విస్తరించిన సిలికా ఖనిజాన్ని అక్రమంగా తరలించే వారిపై ఉక్కుపాదం మోపుతామని గూడూరు డిఎస్పీ భవాని హర్ష స్పష్టం చేశారు. చిల్లకూరు పోలీసుస్టేషన్‌ను ఆయన ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో చర్చించారు. అపరిష్కృత కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి, చిల్లకూరు ఎస్సై హుస్సేన్ భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నెల్‌క్యాస్ట్ బ్యాగ్‌లు




విద్యాసామగ్రిని అందజేస్తున్న సబ్‌కలెక్టర్ ఆనంద్, నెల్‌క్యాస్ట్ యాజమాన్యం

గూడూరులోని నెల్‌క్యాస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో చవటపాలెం ఎలిమెంటరీస్కూలు, హైస్కూలు, దివిపాలెం ఎలిమెంటరీస్కూలు, అర్బన్ హాస్టల్‌లలో చదువుకుంటున్న విద్యార్థులకు, దివిపాలెం ఎస్టీకాలనీ, అడవికాలనీ, సుందరయ్యకాలనీల్లో ఉంటున్న అంగన్‌వాడీ విద్యార్థులకు సబ్‌కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా స్కూల్‌బ్యాగ్‌లు, పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు వగైరాలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నెల్‌క్యాస్ట్ యాజమాన్యం సేవలను అభినందించారు. దివిపాలెం పంచాయితీలోని స్కూల్ విద్యార్థులకు పదేళ్ళుగా ఒక విద్యాసంవత్సరానికి సరిపడే విద్యాసామగ్రిని నెల్‌క్యాస్ట్ వారు అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఇకముందు కూడా ఆ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి తగు సాయం అందించాలని కోరారు. మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల (సర్వశిక్ష అభియాన్) నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ సీనియర్ జి.ఎం(ఆపరేషన్స్) ఎన్ఎస్ రెడ్డి, జిఎం ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నెల్‌క్యాస్ట్ మేనేజర్ (పిఆర్) ఆనిమెళ్ళ శివకుమార్, డిజిఎం (హెచ్ఆర్) టి.మురళీకృష్ణ, సెక్యూరిటీ మేనేజర్ పి.రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు పి.కాంచన, రేవతికుమారి, పురంధర్‌రాజా, బలరామయ్య, నాగమణి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల ఆత్మీయ సమావేశం




గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 21వ తేదీ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్ విచ్చేశారు.

ఈ కార్యక్రమంలో రమణబాబు, మయూరి శ్యాంయాదవ్, రమణయ్య, నాయకులు తాళ్ళూరు శ్రీనివాసులు యాదవ్, బాలిబోయిన రమేష్, పిట్టి నాగరాజు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు ఎంపిడివోగా
# నాగమణి

గూడూరు ఎంపిడివోగా పరిమి నాగమణి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించేదుకు కృషి చేస్తానన్నారు.

## గూడూరు తహశీల్దార్‌గా
# లీలారాణి



గూడూరు మండల తహశీల్దార్‌గా బి. లీలారాణిని జిల్లా కలెక్టర్ నియమించారు. ఈమె గతంలో గూడూరు డివిజన్‌లోని అనేక మండలాల్లో పని చేశారు. అందులో భాగంగా మండల కేంద్రాలైన కోట, మనుబోలు, జిల్లా కలెక్టరేట్‌లో విధులు నిర్వహించారు. ఎక్కడ పనిచేసినా వివాదాలు లేకుండా పనిచేసి వెళ్లిన సందర్భాలున్నాయి. గత ఎన్నికలకు ముందు ఈమెను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. అక్కడి నుండి తిరిగి కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. తిరిగి దగదర్తి తహశీల్దార్‌గా జిల్లా కలెక్టర్ బదిలీ చేసినప్పటికీ ఆమె విముఖత చూపడంతో ఆనంతరం గూడూరు మండల తహశీల్దార్‌గా ఉత్తర్వులు అందడంతో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

# లయన్స్ చేయూత



గూడూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 22న జి.చంద్రశేఖర్ అధ్యక్షతన చెంబడిపాలెం యుపి స్కూల్ విద్యార్థులు 110 మందికి నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా గూడూరు రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి విచ్చేయగా, కార్యదర్శి కడివేటి చంద్రశేఖర్, ఎం.మురళీరెడ్డి, మదనమేటి రమణయ్య, రవిచంద్ర, కాటూరు శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, శివకళ తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# చంద్రయాన్-2 వెనుక అద్భుత శక్తులు

అది నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం. అక్కడ సెమినార్‌లు నిర్వహించే బ్రహ్మ ప్రకాశ్ భవన్. ఆ హాల్‌లో దేశ విదేశాలకు చెందిన ఎంతో మంది శాస్త్రవేత్తలు హాజరైవున్నారు. అప్పుడే వేదికపైకి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి, స్పీడ్‌స్టార్ వై.యస్.జగన్మోహన్‌రెడ్డిలు వచ్చి తమకు కేటాయించిన కుర్చీలలో కూర్చున్నారు. వేదికపై "చంద్రయాన్-2 ప్రయోగం విజేతలకు అభినందన సభ" అనే ఫ్లెక్సీని వ్రాసిపెట్టి వున్నారు. అప్పటికే చంద్రయాన్-2 ప్రయోగం జరిగి నాలుగురోజులై వుండడంతో ప్రయోగంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలను అభినందించడానికి ఆ కార్యక్రమం పెట్టినట్లుగా వుంది.

సభకు అధ్యక్షత వహించిన ఇస్రో ఛైర్మెన్ శివన్ ఇస్రో ప్రయోగాలను మొదటి దాని నుండి చంద్రయాన్-2 దాకా వివరించి, సీఎం వై.యస్.జగన్మోహన్ రెడ్డిని మాట్లాడాల్సిందిగా కోరారు. జగన్ లేచి మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు నీతి, నిజాయితీలకు కట్టుబడ్డారు కాబట్టి చంద్రయాన్-2 ప్రాజెక్ట్‌కు 978 కోట్లే ఖర్చయ్యిందని, అదే మన మాజీసీఎం చంద్రబాబునాయుడుగారికి ఈ ప్రాజెక్ట్‌ను అప్పగించి వుంటే 9,978 కోట్లు ఖర్చు చూపుండేవాడని చెప్పాడు. మన అదృష్టం బాగుండబట్టి 'ఇస్రో' చంద్రబాబు చేతుల్లో లేదని, ఆయన చేతుల్లో ఇస్రో వుండుంటే చంద్రయాన్-2 లాగే సూర్యయాన్-2, స్వర్గయాన్-1 అంటూ ప్రయోగాలు జరిపి దేశ ఖజానాను కూడా తినేసి వుండేవాడని ఆరోపించాడు. తర్వాత గవర్నర్ హరిచందన్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి పోవాలంటే టిక్కెట్లకు కష్టంగా వుండేదని, ఏపికి గవర్నర్‌గా వస్తే తిరుమల దర్శనాలకు ఇబ్బంది వుండదని తెలిసి, కేంద్రం ద్వారా ఒత్తిడి తెచ్చి ఇక్కడకు గవర్నర్‌గా వచ్చానన్నారు. తనకు తిరుమల దర్శనాలతో పాటు స్పెషల్ బోనస్‌గా షార్ సెంటర్ నుండి రాకెట్ల ప్రయోగాన్ని తిలకించే భాగ్యం కూడా కలిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ హాలీవుడ్ సినిమాలకు అయ్యే ఖర్చుతో ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్లు తయారు చేస్తున్నారని, భవిష్యత్తులో షార్ట్ ఫిలింలకయ్యే ఖర్చుతో రాకెట్లను తయారు చేసే విధంగా ఇస్రో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చివరగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ తన పదవీకాలం పూర్తయ్యేలోపు ఇస్రో శాస్త్రవేత్తలు ఇలాంటి అద్భుత ప్రయోగాలన్నీ జరిపితే చూసి తరిస్తానని చెప్పారు. ఇక్కడితో అతిథుల ప్రసంగాలు ముగిశాయి.

తర్వాత ఇస్రో ఛైర్మెన్ శివన్ మైక్ ముందు కొచ్చి... చంద్రయాన్-2 విజయానికి కారణమైన వాళ్ళను ఈ సభావేదిక మీద సత్కరించాలనుకున్నాం... అందుకోసం మేం పిలిచీ పిలవగానే విచ్చేసిన రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, సీఎంలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఇప్పుడు సన్మానం చేయాలనుకునే వారిని వేదికమీదకు పిలుస్తాను. దయచేసి పైకి రావాలి అని చెబుతుండగా 'చంద్రయాన్-2'లో పాల్గొన్న శాస్త్రవేత్తలు వేదికపైకి రావడానికి అన్నీ సర్దుకున్నారు. అంతలో శివన్ నోటి నుండి... ఎంపీస్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రెబల్ మినిస్టర్ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి... కమాన్ టుది దయాస్ అంటూ అరిచారు. ఆ పేర్లు వినగానే హాల్‌లో కొంతసేపు నిశ్శబ్దం. ఈలోపు వీళ్లంతా వేదికనెక్కేశారు. అతిథులు చేతులమీదుగా వారిని శాలువాలు, చంద్రయాన్-2 నమూనా జ్ఞాపికలతో సత్కరించబోతుండగా... హాల్ మధ్యలో నుండి 'ఆపండి' అంటూ పెద్ద కేక... హాల్ మధ్యలో శాస్త్రవేత్త శివనారాయణన్ నిలబడి వున్నాడు. ఏంటి మీ ప్రాబ్లమ్ అని శివన్ అడిగాడు. అసలు వీళ్లెవరు... చంద్రయాన్-2కు వీళ్లకు ఏం సంబంధం. వీళ్ళకు ఆర్బిటర్ అంటే తెలుసా, క్రయోజనిక్ అంటే అర్థం తెలుసా? ఇలాంటి వాళ్ళకా మీరు సన్మానం చేసేది. కేవలం రాజకీయ ఒత్తిళ్ళకు లొంగే మీరు వాళ్ళకు సన్మానం చేస్తున్నారని ఆవేశంగా ఆరోపించాడు. అప్పుడు శివన్ కోపంగా... ఆపు... అక్కడితో ఆపకుంటే బాగుండదు... వాళ్ళ గురించి మీకు ఏం తెలిసి మాట్లాడుతున్నారు. వాళ్ళను సైంటిస్ట్‌లుగానో, రాకెట్‌ను తయారు చేశారనో సన్మానించడం లేదు. వారినెందుకు సన్మానిస్తున్నామో తెలుసుకోవాలంటే ఈ వీడియో చూడు అంటూ వెంటనే అక్కడేవున్న స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా ఒక సీన్ ప్లే చేయించాడు.

అది బెంగుళూరులోని ఇస్రో ఛైర్మెన్ కార్యాలయం. ఆరోజు జులై 16... ఇస్రో ఛైర్మెన్ శివన్ తన సీట్లో దిగాలుగా కూర్చుని వున్నాడు. అప్పుడే శాస్త్రవేత్త వీరపాండ్యన్ లోపలకు వచ్చాడు. శివన్‌ను చూసి ఏం సార్, అంత దిగులుగావున్నారు అని అడిగాడు. శివన్ వుండి దిగులుగా వుండక ఏం చేయమంటావ్.. నిన్న చంద్రయాన్-2 ప్రయోగం జరిగివుంటే హ్యాపీగా వుండేవాడిని. చివరిలో ఆపేయాల్సి వచ్చింది అని అన్నాడు. క్రయోజనిక్ ఇంజన్‌లో ఇంధనం లీక్ వల్లే కదా ఆగిపోయింది అని వీరపాండ్యన్ అన్నాడు. దానికి శివన్... గ్యాస్‌లీక్ అనేది ఒట్టి సాకే... అసలు కారణం మన జిఎస్‌ఎల్‌వి మీద నమ్మకం లేకే! చంద్రుడి మీదకు రాకెట్ తీసుకుపోవాలంటే దీనిలో నింపే ఇంధనం సరిపోతుందా లేదా అనేది నా డౌట్. ఒకవేళ ఇంధనం ఎక్కువైతే అసలు లేవలేదేమో అని ఇంకో డౌట్ అని సందేహం వెలిబుచ్చాడు. అప్పుడు వీరపాండ్యన్... ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఇంతకుముందు నెల్లూరులో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానంద రెడ్డి అనే ఆయన ఒకరుండేవారు. ఇప్పుడాయన నెల్లూరులో లేరు. స్వర్గలోక రాజధాని అమరావతిలో వుంటున్నారు అని చెప్పాడు. శివన్ వుండి.. అక్కడికి పోవాలంటే ఏ బస్సెక్కాలి అని అడిగాడు. వీరపాండ్యన్ దానికి... అక్కడికి పోవాలంటే బస్సు ఎక్కబల్లేదు సార్, బస్సు కింద పడితే చాలు అని చెప్పాడు. వాట్ డూయూ మీన్ అని శివన్ ప్రశ్నించాడు. వీరపాండ్యన్ అసలు విషయం చెప్పాడు. అప్పుడు శివన్... మనం ఏ గ్రహం మీద వుండేవాళ్లతో అయినా మాట్లాడగలం కదా.. స్వర్గంలో వుండే వివేకాతో మాట్లాడడం ఓ లెఖ్ఖా... టిట్‌శాట్-9ను స్వర్గలోకంవైపు తిప్పి వివేకాకు ఫోన్ కనెక్ట్ చేయండి అని ఆదేశించాడు. శాస్త్రవేత్తలు పది నిముషాలలో ఆ పని చేశారు. శివన్ ఫోన్‌లో స్వర్గంలో వున్న వివేకాకు ఫోన్ చేసి తన సమస్య చెప్పాడు. అంతా విన్న వివేకా ఫోన్‌లోనే సమస్యకు పరిష్కారం చెప్పాడు. అయితే ఆ వాయిస్ బయటకు రాలేదు.

ఇక్కడితో స్క్రీన్‌పై సీన్ ఆగింది. ఆ తర్వాత శివన్ మైక్‌ముందుకొచ్చి... దీని తర్వాత ఏం జరిగిందన్నది నేను చెబుతాను. నా సమస్య చెప్పగానే వివేకానంద రెడ్డి అద్భుతమైన ఐడియా ఇచ్చారు. జిఎస్‌ఎల్‌వి రాకెట్‌ను చంద్రమండలం దాకా తీసుకెళ్లాలంటే మీరు క్రయోజనిక్ ఇంజన్‌లలో నింపే ఇంధనం సరిపోదు... వెంటనే నాలుగు స్ట్రాపాన్ బూస్టర్‌లలో ఒక్కోదానిలో ఒక్కో టన్ను ఐఆర్20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ దోమలను నింపండి... అవి రాకెట్‌ను చంద్రమండలానికి కాదు అవసరమైతే సూర్యుడిదాకా అయినా మోసుకుపోతాయి అని చెప్పాడు. ఆయన సలహా మేరకే నెల్లూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ పెద్దలను సంప్రదించి విషయం చెప్పాను. దేశం కోసం మేము ఆ మాత్రం చేయలేమా అంటూ నెల్లూరు నుండి నాలుగుటన్నుల దోమలను సేకరించడంలో వీళ్ళు తమ పూర్తి సహకారం అందించారు. స్ట్రాపాన్ బూస్టర్‌లలో నెల్లూరు దోమలను నింపినందు వల్లే... రాకెట్ అంత విజయవంతంగా పైకి లేచింది. నెల్లూరు ముదురుదోమలకు ఆ శక్తి వుంది. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టే అన్ని అంతరిక్ష ప్రయోగాలకు కూడా నెల్లూరు ముదురుదోమలను వాడుకుంటాం. ఈ మేరకు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వారితో ఎంఓయు కుదుర్చుకున్నాం. ఇప్పుడు చెప్పండి మిస్టర్ శివనారాయణన్ వీళ్ళను సన్మానించడం ఇప్పటికీ తప్పంటారా? అని అడిగాడు. అప్పుడు శివనారాయణన్... ముమ్మాటికీ తప్పే సార్... వీళ్ళను సత్కరించాల్సింది ఇక్కడ కాదు... ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో. అన్ని దేశాల అధిపతుల సమక్షంలో అని చెప్పి కూర్చున్నాడు. అప్పుడు బ్రహ్మప్రకాశ్ హాల్ చప్పట్లతో మార్మోగిపోయింది.

## వారం రోజుల్లో సమస్యలు తీరుస్తాం

### కమిషనర్ పివివిఎస్ మూర్తి

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈనెల 22న స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి పెద్దసంఖ్యలో వచ్చిన అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పింఛన్లు, కొళాయి కనెక్షన్లు, రోడ్లు, డ్రైన్ల సమస్యలతో పాటు వీధిదీపాలు వెలిగించాలని.. ఇలా అనేకరకాలైన సమస్యలతో అర్జీదారులు తమ వినతిపత్రాలను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వారం రోజుల్లోనే అర్జీదారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ పార్థసారధి, మేనేజర్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

### విఎస్‌యులో ప్రారంభమైన..

## కృత్రిమ అడవుల పెంపకం

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో పచ్చదనాన్ని కాపాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నామని, ఇక్కడ కృత్రిమ అడవుల పెంపకం చేపడుతున్నామని విఎస్‌యు వీసీ సుదర్శనరావు అన్నారు. విఎస్‌యు ప్రాంగణంలో ఆయన ఈనెల 22న మొక్కలు నాటారు. ప్రపంచవ్యాప్తంగా అడవులు అంతరించిపోతున్న తరుణంలో జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త అంకిరామియావాకి తక్కువ స్థలంలో కృత్రిమ అడవులు ఎలా పెంచవచ్చో పేర్కొన్నారని, ఈ విధానాన్ని రాష్ట్రంలోని చిత్తూరుజిల్లాలో ప్రవేశపెట్టారని, ఇప్పుడు రెండవసారి నెల్లూరులోని విఎస్‌యులో ప్రవేశపెడుతున్నామని అన్నారు. విఎస్‌యులోని అయిదెకరాల్లో 12వేల మొక్కలు నాటేందుకు కృషిచేస్తున్నామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు సహకరిస్తున్న విఎస్‌యు జాతీయసేవా పథకం సమన్వయకర్త అల్లం ఉదయ్‌శంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ అందె ప్రసాద్, అటవీ అధికారి సుహాసిని, జాతీయ సేవా పథకం విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ నిర్ణయం హర్షదాయకం

### - రేషన్ డీలర్ల సంతోషం

డీలర్లను తొలగించకుండానే వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటుచేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమంటూ ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జివి కృష్ణారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్ణయం పట్ల వారు హర్షం వెలిబుచ్చుతూ డీలర్ల వ్యవస్థకు భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రికి తాము రుణపడి ఉంటామన్నారు. డీలర్లను యధాతథంగా ఉంచి రేషన్‌షాపుల నుంచే వాలంటీర్లు సరుకులు తీసుకువెళ్ళి కార్డుదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల డీలర్లంతా సంతోషించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వందలాదిమంది డీలర్లు నెల్లూరు నగరంలో ఆత్మీయర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు ప్రదర్శనగా వెళ్ళి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, పౌరసరఫరాల మంత్రి కొడాలి నానిని అభినందిస్తూ నినాదాలు చేశారు. వాలంటీర్లకు తామంతా సహకారం అందిస్తూ అన్నదమ్ముల్లా పని చేస్తామంటూ డీలర్ల సంఘం నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### ఆర్యవైశ్య విద్యార్థులకు

## ప్రతిభా పురస్కారాలు

నెల్లూరులోని కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తామని, ఆర్యవైశ్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ఫౌండర్ ట్రస్టీ కారంశెట్టి వెంకట్రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ సెకండియర్ పూర్తిచేసిన ఆర్యవైశ్య విద్యార్థులు వారి మార్కుల జాబితాలను ఈనెల 30వ తేదీలోగా లక్ష్మీ ఇంజనీరింగ్ కంపెనీ, కనకమహల్ సెంటర్, నెల్లూరు అనే చిరునామాకు పంపాలని, వివరాలకు 98853 86888, లేదా 2324156 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఇన్‌స్పైర్ అవార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు పాఠశాలల్లోని విద్యార్థులు వారి ప్రాజెక్టులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతి పాఠశాల నుంచి రెండు,మూడు నామినేషన్స్ తప్పనిసరిగా పంపాలని తెలిపారు. అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు డివిజనల్ వారీగా శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

# జయప్రదంగా... జాబిలి యాత్ర

(మొదటి పేజీ తరువాయి)





ప్రయోగాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు

జులై 22వతేదీ మధ్యాహ్నాం 2.43గంటల సమయం... శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్)లో తీవ్ర ఉత్కంఠ... అందరిచూపులు తూర్పుదిక్కుగా ఆకాశంవైపే... కళ్ళు ఆర్పడం లేదు... ఒక సెకను కన్ను ఆర్పినా అద్భుత దృశ్యాన్ని చూడడం మిస్ అవుతామని.

షార్ కేంద్రంలో కౌంట్‌డౌన్ టెన్ నుండి జీరోకు చేరుకోగానే నిప్పులు విరజిమ్ముతూ నేలను వదిలి నింగికేసి బయలుదేరింది జిఎస్ఎల్‌వి-మార్క్3-ఎం1 వాహక నౌక. 640 టన్నుల బరువుగల వాహకనౌక 3877 కిలోల బరువుగల చంద్రయాన్-2 మాడ్యూల్‌తో అందరూ చూస్తుండగానే క్షణాలలో రోదసిలోకి దూసుకెళ్లింది. వాహకనౌక 16.33 నిముషాలలో నిర్ణీత కక్ష్యలోకి చంద్రయాన్-2ను విడిచిపెట్టింది. కక్ష్యలోకి చేరిన మాడ్యూల్ నుండి సంకేతాలు అందడంతో ప్రయోగంలో తొలిదశ విజయ వంతమైనట్లయ్యింది.

### వారంరోజుల్లోనే...

వాస్తవంగా జులై 15వ తేదీ తెల్లారుజామున 2.53 గంటలకు చంద్రయాన్-2 ప్రయోగం జరగాల్సివుండింది. ఈ ప్రయోగం చూడడానికి అప్పుడు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా వచ్చారు. అయితే 56 నిముషాల ముందు క్రయోజెనిక్ ఇంజిన్‌లో ఇంధనం లీక్ కావడాన్ని గుర్తించి ప్రయోగం నిలిపేశారు. కేవలం 48 గంటల్లోనే ఇస్రో శాస్త్రవేత్తలు లోపాన్ని సరిచేసి కరెక్ట్‌గా వారానికే మళ్ళీ ప్రయోగం నిర్వహించారు.

### 48 రోజుల్లో చంద్రుడిపైకి...

చంద్రయాన్-2 ప్రయోగించిన రోజు నుండి 48 రోజుల్లో చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగనుంది. జులై 15వ తేదీ ప్రయోగం జరిపి వుంటే చంద్రుడిపై దిగడానికి 54రోజులు టైం పట్టి వుండేది. జులై 22న ప్రయోగించడంతో చంద్ర మండలంపై మార్పులకు అనుగుణంగా 6రోజులు కుదించి 48 రోజుల్లో మాడ్యూల్‌ను కుదించేలా శాస్త్రవేత్తలు మార్పులు చేశారు.

### ఆసక్తిగా వీక్షించారు...

ఎప్పుడూ లేని విధంగా చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించడం కోసం దాదాపు 10వేల మంది విద్యార్థులు మరియు ఆసక్తిగల వారిని ఈసారి షార్‌కు అనుమతించారు. వారి కోసం నిర్మించిన గ్యాలరీలో వారంతా కూర్చుని ప్రయోగాన్ని తిలకించడం విశేషం. ప్రయోగం తొలిదశ విజయవంతమైందని తెలియగానే ప్రతిఒక్కరిలో ఆనందం వెల్లివిరిసింది.



## రెయిన్‌బోలో ఘనంగా..
# అంతర్జాతీయ చదరంగ దినోత్సవ వేడుకలు

ఈనెల 20న అంతర్జాతీయ చదరంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూల్లో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. 9వ తరగతి విద్యార్థి మనుదీప్‌రెడ్డి ఓవరాల్ చాంపియన్‌గా బహుమతి సాధించగా, 7వ తరగతికి చెందిన సాయిప్రీతమ్ పాఠశాల స్థాయిలో బెస్ట్‌ప్లేయర్‌గా బహుమతి నందుకున్నాడు. 1 నుంచి 3వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీల్లో బాలుర విభాగంలో 3వ తరగతి విద్యార్థులు ప్రద్యుమ్నరెడ్డి జె. ఆరూష్‌లు బహుమతులు సాధించగా, బాలికల విభాగంలో 2వ తరగతికి చెందిన నాగ అదిత్రి, జాహ్నవి బహుమతులు సాధించారు. 4నుంచి 6వ తరగతి స్థాయి వరకు నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో 5వ తరగతికి చెందిన నోస్మిత్‌సాయి, హర్షిత్‌సాయి, బాలికల విభాగంలో ఆర్.దీక్షిత, హర్షిత బహుమతులు సాధించారు. 7 నుంచి 10వ తరగతి స్థాయి వరకు నిర్వహించిన పోటీల్లో బాలుర విభాగంలో 8వ తరగతికి చెందిన హేమంత్, 9వ తరగతికి చెందిన యం.కార్తీక్, బాలికల విభాగంలో 8వ తరగతికి చెందిన ఆర్.వర్ధిని, 10వ తరగతి విద్యార్థిని ఆర్‌వియస్ చందన బహుమతులు సాధించారు. జాతీయస్థాయి (అండర్-7)లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి మన రాష్ట్రం నుంచి ప్రథమస్థానంలో నిలిచిన బేబి గీతిక (1వ తరగతి)ని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.ప్రతాప్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ బద్దెపూడి హరిత, సురేఖారెడ్డి, చెస్ కోచ్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

# గ్రామాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- రూరల్ కార్యాలయం ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**



మాదరాజు గూడూరు సచివాలయాన్ని పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ మండలంలోని పంచాయతీల్లో గ్రామ అధికారులకు విధిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న ఆయన మండల పరిధిలోని మాదరాజు గూడూరు గ్రామంలో పర్యటించి సచివాలయాన్ని పరిశీలించారు. అయితే అక్కడ స్థానిక విఆర్‌ఓ అందుబాటులో లేకపోవడంతో వెంటనే తహశీల్దారుతో ఫోన్‌లో మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోతే ఎలా అని అడిగారు. గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, అధికారులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రతి గ్రామాన్ని సంబంధిత ప్రజలతో కలిసి సచివాలయాలను ఆకస్మికంగా పరిశీలించడం జరుగుతుందని, అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషిచేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలసి పని చేస్తామన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టిబోయిన వెంకటేశ్వర్లు, బి.సుధాకర్‌యాదవ్, మనోహర్‌రెడ్డి, చెంచుకృష్ణారెడ్డి, రామయ్య, వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయినాధుని నగరోత్సవం



నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో జరిగిన గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 24న బాబా వారి నగరోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. భక్తుల ఓం సాయి.. శ్రీ సాయి.. జయజయ సాయి.. నామ సంకీర్తనల నడుమ వివిధ రకాల పుష్పాలంకరణ శోభితుడైన సద్గురు సాయినాధుడు గరుడ వాహనంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత మందిరం అధ్యక్షుడు మన్నెం అమరనాథరెడ్డి బాబాకు హారతి ఇచ్చి ప్రారంభించారు. బాబా మందిరం నుండి గాంధీబొమ్మ సెంటర్, ట్రంకురోడ్డు, ఏసీ సెంటర్ మీదుగా సంతపేట, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు మీదుగా వీఆర్ కళాశాల సెంటర్ నుండి నెల్లూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చేరుకుని అక్కడ నుండి మందిరానికి చేరుకుంది. దారి పొడవునా మహిళా భక్తుల కోలాటాలు, పండరీ భజనలతో కనువిందు చేశారు. మందిర కమిటీ సభ్యులు పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యామసుందరరెడ్డి, దువ్వూరి జయమ్మ, బి.మోహనరావులు పర్యవేక్షించారు. గురుపౌర్ణమి ఉత్సవాల ముగింపు సందర్భంగా 25వ తేది మధ్యాహ్నం మందిరంలో అన్న ప్రసాద వితరణ జరిగింది.

# వేదవ్యాస స్కూలులో తిలక్, ఆజాద్ జయంతి వేడుకలు




నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూలులో నెల 23న బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తిలక్, ఆజాద్ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. వారి జీవిత ఘట్టాలను నాటకరూపంలో ప్రదర్శించి అలరించారు. స్కూలు కరస్పాండెంట్ ఎపి బాలాజీ తిలక్, ఆజాద్ జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్-2 ప్రయోగానికి సంబంధించిన విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. స్కూలు డైరెక్టర్ ఎపి వేదగిరి వందన సమర్పణ చేసారు. అనంతరం జాతీయగీతంతో సభ ముగించారు.

# షిరిడీలో నెల్లూరు వాద్యబృందం కచేరి



షిరిడీలోని శ్రీ సాయిబాబా సమాధి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఇటీవల నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతి నగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం ఆస్థాన విద్వాంసుడు వంగపాటి శ్రీకాంత్ బృందం వారిచే శాక్సోఫోన్, మంగళవాయిద్యాల కచేరీ వీనులవిందుగా జరిగింది. షిరిడీ సంస్థాన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ బృందాన్ని సత్కరించి, ప్రసాదాలందజేశారు.

సాయిదర్బార్‌లో...

# మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా ఈనెల 21న నెల్లూరు మాడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందంచే మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 200మంది రోగులను పరీక్షించి, 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరికి మాడరన్ ఐ హాస్పిటల్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# 25 నుంచి ఆండాళ్ తిరువాడిప్పూర ఉత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేట పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా కీర్తింపబడుతున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో ఈనెల 25 నుండి ఆగస్టు నెల 4వ తేదీ వరుకు శ్రీ ఆండాళ్ తిరువాడిప్పూర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహాణాధికారి వేమూరి గోపి, ఛైర్మన్ కోట గురుబ్రహ్మం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకు తిరుమంజనం, సాయంత్రం 5.45 గంటలకు ప్రాకారోత్సవం, రాత్రి 7గంటలకు సేవా కాలం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని, అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

# 'మై ఫ్రెండ్స్' చేయూత



బాధితురాలి కుటుంబసభ్యులకు నగదును అందజేస్తున్న పొణకా దేవసేన, కమిషనర్ ఓబులేశు

గూడూరు పట్టణంలోని గమళ్ళపాళెం ప్రాంతానికి చెందిన కవిత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. పేదరాలైన ఆమెకు శస్త్రచికిత్సకు అయ్యే వైద్యఖర్చుల నిమిత్తం పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంధ సేవా సంస్థలు, దాతలు ముందుకువచ్చి సాయం అందిస్తున్నారు. ఈ క్రమంలో మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు విరాళాల ద్వారా సేకరించిన 50వేల రూపాయలను 23న పురపాలక సంఘం మాజీఛైర్మెన్ పొణకా దేవసేన చేతులమీదుగా బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. మెప్మా పి.డి చిరంజీవి, మునిసిపల్ కమిషనర్ ఓబులేశు, రాహుల్, కలీం, నంద, శ్రీను, సాయి పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌ను నిర్మూలించాలి

ఆర్.అలేఖ్య

హెచ్‌ఐవి గురించి అందరూ తెలుసుకోవాలని, ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా హిజ్రాల సంఘం నాయకురాలు ఆర్.అలేఖ్య అన్నారు. చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అలేఖ్య మాట్లాడుతూ ఎయిడ్స్‌వ్యాధి సమాజంలో చాపకింద నీరులా పాకుతోందని, ఈ వ్యాధి బారిన పడకుండా అందరూ తగు జాగ్రత్తలు వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ చిరంజీవితో పాటు హిజ్రాల సంఘం సభ్యులు హైమ, మయూరి, సల్మా, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర మహిళామండలి భవన్‌లో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న డాక్టర్ సి.రోహిణి, జీవని తదితరులు

గూడూరులోని ఆసుపత్రిరోడ్డులో ఉన్న ఆంధ్ర మహిళామండలి భవనంలో మంగళవారం నాడు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు, మహిళామండలివారు ఆ భవన ప్రాంగణంలోని కలుపుమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఇక్కడ త్వరలో మొక్కలు నాటుతామని డాక్టర్ రోహిణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు జీవని, ప్రభారెడ్డి, సుప్రియ, ఇంద్రసేనమ్మ, విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

# కట్టుతప్పుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

తాళం వేసి వుంటే... "నువ్వు మగాడివైతే నీకు దమ్ము ధైర్యం వుంటే" అంటూ అచ్చెన్నాయుడు నోటికొచ్చినట్లు వాగినప్పుడు ఇదే చంద్రబాబు అతనిని మందలించి వుంటే... నువ్వు దొంగవు, ఫోర్ట్వంటీవీ అంటూ ప్రతిపక్ష నేతనుద్దేశించి దేవినేని ఉమామహేశ్వరరావు చేసిన రొచ్చు వ్యాఖ్యలను చంద్రబాబు ఖండించి వుంటే... అసలు మీ అంతు చూస్తా, మీ కథేంటో తేలుస్తానంటూ చంద్రబాబే సభలో అనకపోయి, సంస్కారవంతంగా మాట్లాడి వుంటే... నిన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవాల్సిన అసెంబ్లీ స్థానాలు 23 కాదు... ప్రభుత్వ వ్యతిరేకత వల్ల అధికారం కోల్పోయినప్పటికీ కనీసం ఇంకో 23 సీట్లన్నా గెలిచివుండాలి. కేవలం చంద్రబాబు పాలనా వైఫల్యం వల్లే ఇంత ఘోర పరాజయం రాలేదు... ఐదేళ్ల పాటు అసెంబ్లీలో ఆ పార్టీ సభ్యులు చేసిన అరాచకాలకు, నీతిబాహ్యామైన పనులకు ప్రజలు ఇచ్చిన గుణపాఠమే నిన్నటి తీర్పు.

అసెంబ్లీలో చేసిన తప్పులకు ప్రజలు తెలుగుదేశం పార్టీని ఏ స్థాయిలో శిక్షించాలో అంతకంటే పైస్థాయిలోనే శిక్షించారు. ఇక వాళ్ళ పనైపోయింది. మళ్ళీ ఎన్నికలొచ్చే దాకా వాళ్ళకు సభా సాంప్రదాయాలతో పని లేదు.


తెలుగుదేశం పార్టీకి ప్రజలు నేర్పిన గుణపాఠాన్ని గురించి పూర్తిగా తెలుసుకోవాల్సింది ఇప్పుడు అధికారంలో వున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులే! మన మాట, మన నడవడిక సరిగా లేకుంటే నిన్న తెలుగుదేశంకు బుద్ధి చెప్పిన ప్రజలే రేపు వైసిపికి బుద్ధి చెప్పరనే గ్యారంటీ ఏమీ లేదు.

రాజకీయాలు ఎంతగా చెడిపోయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలకు ఇంకా కొంత గౌరవం మిగిలేవుంది. రాజకీయ నాయకులు ప్రచార సభలలో ఒకర్నొకరు దుమ్మెత్తి పోసుకుంటే ప్రజలు పట్టించుకోరు, రోడ్ల మీద పడి తన్నుకుని, బూతులు తిట్టుకున్నా ఏమీ అనుకోరు. కాని, చట్టసభలలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే మాత్రం ప్రజలు సహించడం లేదు. మీకు ఓట్లేసి మిమ్మల్ని గెలిపించింది అసెంబ్లీ కెళ్లి వాళ్ళను, వీళ్లను తిట్టడానికా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రస్తుత బడ్జెట్ సమావేశాలలో కొందరు వైసిపి సభ్యుల ప్రవర్తన, మాట్లాడిన తీరు ప్రజల్లో కొంత వ్యతిరేకతను తెచ్చాయి. కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలైతే ప్రతిపక్ష నేత చంంద్రబాబును తిట్టడమే పనిగా పెట్టుకున్నట్లుంది. సభలో సబ్జెక్ట్‌ల గురించి ఎంతసేపైనా మాట్లాడొచ్చు. అధికారంలో వున్నప్పుడు సీఎంగా చంద్రబాబు, ఆయన మంత్రులు చేసిన అవినీతి అక్రమాలను లెక్కలతో సహా ఎండగట్టొచ్చు. సుతిమెత్తని విమర్శలనే ఈటెలుగా మార్చి వాళ్ళ గుండెల్లో దించవచ్చు. చట్ట సభలలో అందరికీ ఆమోదయోగ్యమైన భాష ఒకటుంటుంది. సభ్యులు ఆ భాషనే వాడాలి. తొడలు చరచడం, దమ్ము, ధైర్యం వుంటే అంటూ సవాళ్ళు విసరడం, మీసాలు మెలేయడం, బుల్లెట్లు, గన్‌లు, ఖబడ్దార్ వంటి పదాలను ప్రజలు స్వాగతించరు.

ముఖ్యంగా ప్రజల దృష్టంతా కూడా ప్రతిపక్ష సభ్యుల మీదకంటే అధికారపార్టీ సభ్యుల వ్యవహారశైలి మీదే ఎక్కువుగా వుంటుంది. ప్రతిపక్ష సభ్యులను వాళ్ళు పక్కనపడేశారు. వారిపై ప్రజల దృష్టి పడదు. తాము ఓట్లేసి గెలిపించిన అధికార పార్టీ సభ్యులు సభలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారా లేదా? అనే చూస్తారు!

గత ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ వాళ్ళు తమను నోటికొచ్చినట్లు తిట్టారని, వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని నానా మాటలు అన్నారని చెప్పి... ఈరోజు సభలో వైసిపి వాళ్ళు ప్రతీకార చర్యలకు పోనవసరం లేదు. వాళ్లలాగే నోర్లేసుకుని అరవనవసరం లేదు. వాళ్లు అలా అరచి సభ్యతను మరువబట్టే ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారనే విషయాన్ని వైసిపి వాళ్ళు ముందుగా గుర్తించాలి. వాళ్ళలాగే మేం కూడా ప్రవర్తిస్తామంటే టిడిపికి వైసిపికి మధ్య ప్రజలు ఇక ఏ విధంగా తేడా చూడగలరు. కాబట్టి శాసనసభలో గత టిడిపి సభ్యులు చేసిన పొరపాట్లు చేయకుండా వైసిపి సభ్యులు మాటల్లో, నడతలో హుందాగా, ప్రజల మన్ననలు పొందేలా వ్యవహరించాల్సి వుంది.

కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.

01-08-2019 గురువారం ఆ మహనీయుని 42వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎం.పి

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి



## కుమారస్వామికి...
# కలిసిరాని బాబు అభయహస్తం!

**సం'కుల' రాజకీయాలకు సంకీర్ణ ప్రభుత్వాలకు నెలవుగా మారిన కర్నాటక మరోసారి జాతీయ వార్తల్లోకి ఎక్కింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ఇష్టపడి, ఇంకెంతో కష్టపడి నిలబెట్టిన కాంగ్రెస్-జెడి(ఎస్) పార్టీల సంకీర్ణ ప్రభుత్వం 14నెలలకే కుప్ప కూలింది. దీంతో చంద్రబాబు హస్తవాసి కుమారస్వామికి కలిసిరాకుండా పోయింది.**

2018 మేలో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 104 సీట్ల వద్ద ఆగిపోయి మెజార్టీకి 8 సీట్ల తేడాతో దూరం కావడం తెలిసిందే! అప్పుడే బీజేపీతో విభేదించి రంగంలోకి దిగిన చంద్రబాబు కాంగ్రెస్ – జెడి(ఎస్)లను ఒక తాటిమీదకు తెచ్చాడు. బీజేపీకి అధికారం దక్కకుండా చేయాలనే అక్కసుతో కాంగ్రెస్ కూడా తమలో సగం సీట్లు కూడా గెలవని కుమారస్వామిని ముఖ్యమంత్రిని చేయడానికి ముందుకొచ్చింది. బీజేపీయేతర పక్షాల నేతలంతా బెంగుళూరుకు రాగా కాంగ్రెస్ మద్దతుతో కుమారస్వామి పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది.

అయితే ఏడాది దాటగానే కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 15మంది అసమ్మతి గానం ఆలపించడం, వారు తమ పదవులకు రాజీనామా చేయడంతో కుమారస్వామి ప్రభుత్వం మైనార్టీలో పడిపోయినట్లయ్యింది. అనేక నాటకీయ పరిణామాల మధ్య జూలై 23వ తేదీ కర్నాటక అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నిర్వహించగా కుమారస్వామికి మద్దతుగా 99మంది, వ్యతిరేకంగా 104మంది ఓటేశారు. దీంతో సభావిశ్వాసం కోల్పోయిన కుమారస్వామి సీఎం పదవికి రాజీనామా చేశారు.

2018 మే 23న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కుమారస్వామి జూలై 23వ తేదీన దిగిపోయారు. చంద్రబాబు '23' అంకె సెంటిమెంట్ ఆయనకు కూడా చుట్టుకున్నట్లయ్యింది.

## కర్నాటక బీజేపీదే..?

15మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలతో కర్నాటక అసెంబ్లీలో బలాబలాలు తారుమారయ్యాయి. 104 మంది బీజేపీ సభ్యులకు మరో ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు తోడైనందువల్ల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వారికి సులభమే! కాకపోతే రేపు రాజీనామా చేసిన 15మంది ఎమ్మెల్యేల స్థానాలకు ఉపఎన్నికలు జరిగితే.... అక్కడ వచ్చే ఫలితాలను బట్టి కూడా రాజకీయ మార్పులుండొచ్చు.







Estd: 1979

# N.B.K.R.I.S.T.

## (AUTONOMOUS)

**Affiliated to JNTUA, Anantapuramu**

Vidyanagar, S.P.S.R Nellore Dt. Phone : 08624 - 228247. www.nbkrist.org

- Courses accredited by NBA under tier - 1
- Accredited by NAAC with 'A' grade
- Accorded 'A' grade by Government of AP
- College with Potential for Excellence

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చదువుకొను విద్యార్థులందరికి

100% ఫీజు రాయితీ కల్పించినందులకు

గౌరవ ముఖ్యమంత్రి వర్యులు

శ్రీ వై.యస్. జగన్మోహన్ రెడ్డి గారికి

మా హృదయపూర్వక ధన్యవాదాలు

ప్రభుత్వంవారు 100% ఫీజు రాయితీయిస్తున్నందున విద్యార్థులు NBA, NAAC మరియు AUTONOMOUS స్థాయిని కలిగిన కళాశాలలో ప్రవేశం పొందడానికి మంచి అవకాశం


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com